https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సారధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 281 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శుక్రవారం, ఆగస్టు,7, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




## పార్లమెంటులో గ్యాస్ కనెక్షన్లపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



హనుమకొండ కొప్పుల రాజేందర్ (డీకే చాటింపు) వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు అందుతున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, రీఫిల్ సబ్సిడీ, గ్యాస్ వినియోగ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో గురువారం ప్రశ్నించారు. గత మూడేళ్లలో వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఎన్ని ఉజ్వల కనెక్షన్లు ఇచ్చారని పేద కుటుంబాలు గ్యాస్ సిలిండర్లను నిరంతరం వినియోగించేలా రీఫిల్ ధరలను అందుబాటులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటనే అంశాలపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరారు. ఈమేరకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2026 జూలై 1 నాటికి 1.22 లక్షల ప్రధానమంత్రి ఉజ్వల యోజన (ప్రీవీఖ్) గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు వెల్లడించారు. 2023-24లో 2,928, 2024-25లో 84, 2025-26లో 2,835 కనెక్షన్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. జిల్లాల వారీగా జనగామలో 1,825, హనుమకొండలో 1,359, వరంగల్‌లో 760, జయశంకర్ భూపాలపల్లిలో 1,903 కనెక్షన్లు గత మూడేళ్లలో విడుదలైనట్లు వివరించింది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పేద మహిళల జీవన నాణ్యతను మెరుగుపర్చేందుకు ఉజ్వల పథకం ఎంత కీలకమైనా, కనెక్షన్ ఇచ్చినంత మాత్రాన లక్ష్యం నెరవేరినట్లు కాదన్నారు. ప్రతి పేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులు లేకుండా గ్యాస్ సిలిండర్‌ను క్రమం తప్పకుండా రీఫిల్ చేసుకునే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఇంకా అర్హులైన కుటుంబాలు మిగలకుండా ఉజ్వల కనెక్షన్లు ఇవ్వాలని, రీఫిల్ సబ్సిడీని కొనసాగించడంతో పాటు అవసరమైతే మరింత పెంచాలని కేంద్రాన్ని కోరారు.

## టస్ అధ్వర్యంలో జయశంకర్ సార్ జయంతి వేడుకలు

ఎల్బీనగర్, ఆగష్టు 6 (డీకే చాటింపు) తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన టీయుఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్, ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్న మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన గొప్ప తెలంగాణ వాది జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన అరుదైన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని రూబీ, వెంకన్న లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంట సుదర్శన్, రాష్ట్ర నాయకులు జాన్, గ్రేటర్ హైదరాబాద్ సభ్యులు శ్రీకాంత్, దాసు, అశోక్, హాసన్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్ము రాజశేఖర్, సమన్వయకర్త ఇరుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆచార్య జయశంకర్ సార్‌కు "తెలంగాణ జాతిపిత" హోదా కల్పించాలి

### -- మామునూరు విమానాశ్రయానికి జయశంకర్ సార్ పేరు పెట్టాలి





కరీంనగర్ (డికె చాటింపు) : ఆరు దశాబ్దాల చిరకాల వాంఛ అయిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో తెలంగాణ జాతీయతను, తెలంగాణ ఆత్మగౌరవాన్ని సజీవంగా ఉంచిన తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా కరీంనగర్ నగరంలోని ఆచార్య జయశంకర్ సార్ విగ్రహం వద్ద ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కె. శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు వంగల పవన్, గొట్టిముక్కుల ఉమారాణి--రమణ, గుగ్గిళ్ల రమేష్, ఆరీఫ్, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ అనిల్, బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం తదితరులతో పాటు తెలంగాణ విశ్వకర్మ వేదిక ఆధ్వర్యంలో వివిధ విశ్వబ్రాహ్మణ సంఘాలు, ప్రజా సంఘాలు, కవులు, కళాకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన విశిష్ట వ్యక్తిత్వాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధనలో చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విశ్వకర్మ వేదిక తరపున సదాశ్రీ శ్రీమంతుల మాట్లాడుతూ, వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయానికి ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ పేరు పెట్టాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ప్రతిపాదనను పార్టీ అధిష్ఠానాల దృష్టికి తీసుకెళ్లాలని సభకు విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావుతో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులను కోరగా వారు వారి పార్టీ తరపున కృషి చేస్తామన్నారు. అలాగే, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్‌ను అధికారికంగా "తెలంగాణ జాతిపిత"గా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు శ్రీరామోజు రవీంద్రాచారి, తిప్పారపు శ్రీనివాస్ , గుండోజు లక్ష్మయ్య, ఓంకార్, గద్దె సత్యనారాయణ, గాలిపెల్లి శంకరయ్య, సత్యం(ఓపా) న్యాయవాది మంతెన శ్రీనివాస్, గద్దె జగదీశ్వరాచారి (వేవా), ప్రభాకరాచారి (వేదాస్), కట్ట జగన్, దేవరకొండ కృష్ణ,రామకృష్ణ రావుల శ్రీధర్, శ్రీనివాస్, ( స్వర్ణకార సంఘం ) చెల్లోజు రాజు ( ఐక్య సంఘం ) మంచిర్యాల రాజ బ్రహ్మం , హయగ్రీవాచారి, రాజు ( కార్పెంటర్ సంఘం ) కొత్తపల్లి బహ్మాచారి , తిరుమాలాచారి ( పురోహిత సంఘం ) టీజేఏసి నేత కోటేశ్వర్, జయశంకర్ ట్రాలీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, తదితర విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నేతలు ,ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సామాజిక వేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగించాలి

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు

### కరీంనగర్ జిల్లా జిల్లా అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాసచారి

జగిత్యాల, ఆగష్టు 6 (డీకే చాటింపు) ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తూ ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జిల్లా అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాసచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కుల కులవృత్తులు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 50 సంవత్సరాలకు పింఛను కూడా కుల వృత్తుల వారికి 5000 రూపాయలు కోరారు చేసుకునే వారికి వృత్తులు సందర్భంలో జీవన ఉపాధి కొరకు చేయాలని విశ్వబ్రాహ్మణ కుల సంఘాలు నాయకులు ఇల్లందుల పురుషోత్తం సింహరాజు సూర్యనారాయణ మండలోజు ఉదయభాస్కర్ సామాజిక సమరసత



కరీంనగర్ జిల్లా విభాగం చెట్ల గంగాధర్ గారు తొగిటి గంగాధరి అనిల్ సత్యనారాయణ శ్రీనివాస్ సునీల్ తగిటి రాజమౌళి నరసింహ చారి శ్రీకాంత్ రాజేష్ పలువురు నాయకులు పాల్గొన్నారు

## ఎక్లాస్‌పూర్ పాఠశాలలో పాముకాటుతో విద్యార్థి మృతి

-పాఠశాల గోడపై పాకుతూ కిటికీలో విద్యార్థి చేతిపై కాటు వేసిన పాము... -మెరుపు వేగంతో తరగతి గదిలోకి చొరబడి విద్యార్థులను హడలెత్తించిన విష సర్పం... -ఎక్లాస్‌పూర్ గ్రామంలో విషాదఛాయలు... -పాము కాటుకు గురైన విద్యార్థిని ఆసుపత్రికి తరలింపు... -చికిత్స పొందుతూ మృతి... -ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి మృతి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం... -బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలి... -తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)నారాయణపేట నియోజకవర్గ ఇన్చార్జి గవినోళ్ల శ్రీనివాస్...









నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రంజిత్ కుమార్(8)విద్యార్థి ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో గురువారం మధ్యాహ్నం పాము కాటుకు గురై మృతి చెందారు. తరగతి గదిలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో మిగతా విద్యార్థులు,ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. ఆ గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం భోజనం తర్వాత ప్రారంభమైన తరగతి గదుల్లో కిటికీ పక్కన కూర్చున్న రంజిత్ కుమార్ చెయ్యి కిటికీ బయటికి ఉంచగా అదే సమయంలో పాఠశాల గోడ వైపు పాకుతూ వచ్చి ఆ విద్యార్థి చేతిపై కాటు వేసినట్లు సమాచారం. పాము పామని అరవడంతో తిరిగి ఆపాము మెరుపు వేగంతో తరగతి గదిలోకి చొరబడింది. ఈ విష సర్పం రంజిత్ కుమార్ ను కాటు వేయడంతో తమను పాము కాటు వేసినట్లు గుర్తించారు. దాంతో మిగతా విద్యార్థులందరూ తరగతి గదుల నుంచి బయటికి పరుగులు తీశారు. అక్కడే ఉన్న పలువురు ఆ పామును పట్టుకొని చంపివేశారు. పేద కుటుంబానికి చెందిన బాలుడు చదువుకోవాలనే ఆశతో పాఠశాలకు వెళ్లిన చోట ఈ విషాద సంఘటన జరగడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పాముకాటుకు గురైన విద్యార్థిని వెంటనే నారాయణపేట జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే ఆ విద్యార్థి కోమాలోకి వెళ్లి మృతి చెందినట్లు సమాచారం. పాఠశాల తరగతి గదిలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

పాఠశాల తరగతి గదిలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడం అత్యంత విషాదకరమని,ఇది ప్రభుత్వం,విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలంగాణ రక్షణసేనపార్టీ జిల్లా అధ్యక్షులు నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచకుండా, విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వహించిన క్లాస్ టీచర్, ప్రధానోపాధ్యాయుడు, సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం,కుటుంబానికి అన్ని విధాలా ప్రభుత్వ సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కోరారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పుడు పాఠశాలల్లో పాము కాటుకు కూడా చిన్నారులు బలవుతున్న పరిస్థితి అత్యంత దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భద్రతను కాపాడాల్సి న ప్రభుత్వం ఈ ఘటనపై పూర్తి బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, పొదలు,చెత్త,పాములు, ఇతర విషజంతువులు సంచరించే ప్రాంతాలను పూర్తిగా తొలగించి, విద్యార్థులకు సురక్షితమైన కల్పించాలని ప్రభుత్వాన్ని గవినోళ్ల డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి,బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని,బాధ్యులపై చర్యలు తీసుకొని భవిష్య త్తులో విషా దాలు పునరావృతం కాకుండా శాశ్వత భద్రతా చర్యలు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ తరఫున జిల్లా అధ్యక్షులు, నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం





మహేశ్వరం, ఆగష్టు 6( డీకే చాటింపు) సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ సీనియర్ సిటిజెన్ భవనంలో జయ శంకర్ సర్ జయంతి సందర్భంగా ఆయనకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషథ్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం, సీనియర్ సిటిజెన్ సలహాదారులు వివిఎన్ శ్రీనివాస్ రావు జయ శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పొన్నాడ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, తెలంగాణ గురించి ఆయన చేసిన సేవలు కొనియాడారు, వివిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ అంటే జయ శంకర్ సర్,ఆయన చేసిన ఉద్యమాలు మనందరికీ స్ఫూర్తి అని, ఆయనతో పాటు ఎంతో మంది ఉద్యమకారులు ఉన్నారని అన్నారు. డాక్టర్స్ కాలనీ సీనియర్ సిటిజెన్ బిల్డింగ్ లో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమ పర్యవేక్షణలో భాగముగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం 120,121,122,123,124, బీఎల్ఓలతో మాట్లాడుతూ, పోలింగ్ బూత్ ఏజెంట్లు అయిన బీఎల్ఏలు పార్టీ తరుపున అవేరేజ్ గా అన్ని బూతులు కలిపి 70% సుమారుగా ఉంది. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ మాట్లాడుతూ, బీఎల్ఓలతో పాటు మునిసిపల్ బిల్ కలెక్టర్స్ ఉంటే 100% అవుతుంది అని అన్నారు. ఎందుకంటె హౌస్ నంబర్స్ వారికి తెల్సు హౌస్ టాక్స్ వారికీ కడతారు కాబట్టి యిల్లు ఎక్కడ ఉంటుందో అందులో ఓనర్ సెల్ నెంబర్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ కోశాధికారి వుటుకురీ దయాకర్, నరేష్, శ్రీనివాస్, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ మొహాద్ ఇష్టిక్ గులషన్ బడంగ్పేట్ అబ్సర్వర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు స్వరూప్ రాజ్, అప్పారావు, సత్యం సీనియర్ సిటిజెన్ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన లో ప్రజలు పడుతున్న
# ఇబ్బందులను తీర్చడమే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యం
## టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 6 (డీకే చాటింపు) ప్రజాపాలన లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చడమే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యం అని సామిడి గోపాల్ రెడ్డి అన్నారు. ప్రశాంతి హిల్స్ డివిజన్ 58. లోని 28వార్డ్ లో శివ సాయి నగర్ కాలని లో అధ్యక్షులు పప్పు శామ్ మరియు అసోసి యేషన్ వారి ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమం లో భాగంగా కాలనీ లో ని పలు సమస్యలు టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డికి తెలియజేసారు స్థానికసమస్యలపై గోపాల్ రెడ్డి సమస్య లను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు లేని కలనిగా అతి త్వరలో మారుస్తానను హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మలా రవీందర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరీ చరణ్ రెడ్డి సామిడి మహేశ్వరం నియోజకవర్గం ప్రెసిడెంట్



అకిటి దిక్షిత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ధరవాత్ స్వామి నాయక్, నక్క బాలకృష్ణ, , మండల్ యూత్ వైస్ ప్రెసిడెంట్ వరి కుప్పల శివ గడివేముల కృష్ణ, మట్ట సత్యనారాయణ సార్ల రవి గుడేటి నర్సింహా, డేరింగుల వంశీ మరియు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి
# టీజీఎన్‌పీడీసీఎల్ కట్టుబడి ఉంది
### సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి

హనుమకొండ కొప్పుల రాజేందర్ (డీకే చాటింపు) టిజిఎన్పీడీసీఎల్ ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి గురువారం అన్నారు. హన్మకొండ, నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని కాజీపేట సెక్షన్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహించిన ఉకంటి ప్రకాష్ భార్య ఉకంటి సంధ్యకు సీఎండీ రూ.1.05 కోట్ల బీమా చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో విధులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉకంటి ప్రకాష్ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి యూనియన్ బ్యాంక్ సాలరీ ప్యాకేజీ గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా అందుతున్న రూ.1.05 కోట్ల బీమా మొత్తం ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లల విద్యాభ్యాసం, భవిష్యత్



అవసరాలకు కొంతమేర అండగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఉకంటి ప్రకాష్ కుమారుడు ఉకంటి ప్రణవ్‌కు కారుణ్య నియామకం కింద టీజీఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి కమలాకర్ గంటి, నక్కలగుట్ట బ్రాంచ్ మేనేజర్ బసవరాజు వి.కె, ఇతర ఉన్నతాధికారులు, టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే విద్యార్థులను ప్రశంసించిన కలెక్టర్

### -జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నారాయణపేట విద్యార్థుల సత్తా... -మూడు బంగారు,ఒక వెండి పతకం సాధించిన...

నారాయణపేట,(డీకే చాటింపు): విశాఖపట్నం జిల్లా గాజువాకలో ఆగస్టు 2న నిర్వహించిన 4వ జాతీయ స్థాయి డ్రాగన్ షోటోఖాన్ కరాటే-డో స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో నారాయణపేట జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడు బంగారు,ఒక వెండి పతకాలను సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలబెట్టారు. ఈ పోటీల్లో అండర్-12 విభాగంలో ఆదిత్య ఫైట్ విభాగంలో బంగారు పతకం సాధించగా, అండర్-14 విభాగంలో టీ. సూర్య అన్విత్ ఫైట్ విభాగంలో బంగారు పతకం, ధనియాల్ కాటా విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. అండర్-18 విభాగంలో నరసప్ప ఫైట్ విభాగంలో వెండి పతకం సాధించారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,కర్ణాటక,కేరళ, తమిళనాడు,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నారాయణపేట జిల్లా విద్యార్థులను గురువారం జిల్లా కలెక్టర్ సీ. హెచ్. ప్రియాంక అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కె. అంజన్ ప్రసాద్,



ఎగ్జామినర్ సి. అంబ్రేష్ మాస్టర్,టోర్నమెంట్ ఇన్‌చార్జ్ మొహమ్మద్ సలీం, నారాయణపేట జిల్లా ప్రెసిడెంట్ అశోక్,ఉమ్మడి మండలాల ప్రెసిడెంట్ తాయప్ప,కరాటే మాస్టర్లు అనిల్,జయశ్రీ,నవీన్, తాయ్యబ్,శివ,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత అక్క కోసం కదిలిన దండు

### -నారాయణపేట నుంచి గవినోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో... -తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన సామజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు తరలి వెళ్లిన పార్టీ శ్రేణులు...

నారాయణపేట,(డీకే చాటింపు): తెలంగాణ రక్షణ సేన పార్టీ (టీఆర్ఎస్)రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ లో జరుగుతున్న సామజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు నారాయణపేట నియోజకవర్గం నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. కల్వకుంట్ల కవిత హైదరాబాద్ తదితర చోట ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమానికి ఈ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ఆ పార్టీ శ్రేణులు వెళ్లి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నారు. టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గం నుంచి 22 ప్రత్యేక కార్లల్లో వివిధ మండలల నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున హైదరాబాద్ సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమం లో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి గవినోళ్ల శ్రీనివాస్ పూలమల వేసి నివాళులు అర్పించిన అనంతరం ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. హైదరాబాదుకు బయలుదేరిన వారిలో టీఆర్ఎస్ నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్,దామరగిద్ద మండల అధ్యక్షులు నర్సింహా రెడ్డి,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్,లోకుర్తి



మనిక్యప్ప,లింగారెడ్డి పల్లి నారాయణ,పిల్లే బండ నర్సిములు,నర్సాపూర్ లాలప్ప,పకిరప్ప,అశోక్, విట్లపూర్ బీమప్ప,నర్సప్ప, అశన్ పల్లి నారాయణ రెడ్డి, రమేష్,నర్సింహా,గ్రామ అధ్యక్షులు కేశవ్,లోకుర్తి వెంకటప్ప,దేశాయ్ పల్లి శ్రీనివాస్,అప్పంపల్లి రాజు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యల సాధనకై
# సెప్టెంబర్ ఒకటి ధర్నాను విజయవంతం చేద్దాం

### -పిఆర్టీయు టీఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి...
### -ధన్వాడ మండలంలో పిఆర్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం...





నారాయణపేట,(డీకే చాటింపు): అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యల సాధన పిఆర్టియు తోనే సాధ్యమవుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పిఆర్టియు టిఎస్ ధన్వాడ మండల శాఖ అధ్యక్షులు కే. కిష్టయ్య,ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మన్న,జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో పిఆర్టియు టీఎస్ 2026-2027 విద్యా సంవత్సరానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నిర్లక్ష్యం కారణంగా పి.ఆర్.సి,డిఏలు, బిల్లులు పెండింగ్లో పెట్టడం సగటు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా పరిణమిచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్తో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం హెల్త్ కార్డ్స్ అమలులో ఉన్న సమస్యలను గురించి,కేంద్ర ప్రభుత్వం,హైకోర్టు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో సిపిఎస్ ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ అమలుపరుస్తామని చెప్పి దాదాపు మూడు ఏళ్లైన అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులలో అసహనం పెరిగిపోతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే సిపిఎస్ రద్దు,అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను కలగజేయాలని,అన్ని రకాల ప్రమోషన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ ఒకటిన చేపట్టిన పిఆర్టియు ధర్నా కార్యక్రమాన్ని సంఘం పక్షాన పెద్ద మొత్తంలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగార్జున రెడ్డి, సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు గౌస్,నర్సింహా రెడ్డి,జిహెచ్ఎం రఘు, మోహన్,సురేష్,రవి వర్మ, రమేష్,లక్ష్మీ,చంద్రం నాయక్, వెంకట రాములు,శిరీష,ఎల్ ఎఫ్ఎల్ హెచ్ఎం అనురాధ, అనిత,రాధిక,చెన్నమ్మ, మానస,భారతమ్మ,భాస్కర్ రెడ్డి,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ కు ఘన నివాళర్పించిన
# హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ కొప్పుల రాజేందర్ (డీకే చాటింపు) తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆలోచనలు, ఆశయాలు రాష్ట్ర ప్రజలకు స్ఫూర్తిదాయకమని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊశారని,అందుకే ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఉద్యమాల వెనుక మేధావుల పాత్ర ప్రధానంగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఎన్నో ఉద్యమాలలో ఉపాధ్యాయులు పాత్ర, సైద్ధాంతిక మార్గదర్శకం ద్వారా విజయవంతం అయ్యాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విలీనం అయిన తర్వాత తెలంగాణ ప్రాంత వెనుకబాటుతనాన్ని 1952లోనే గుర్తించి 1969 లో వచ్చిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆచార్య జయశంకర్ క్రియాశీలక పాత్రను పోషించారన్నారు. తెలంగాణ ఉద్యమానికి శ్వాసగా నిలిచి, తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడంలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు మనకెంతో



స్ఫూర్తిదాయకమన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం, తదితర అంశాల్లో మిగతా రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు చేయూతనందిస్తూ ఆచార్య జయశంకర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను,జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు
## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### -నారాయణపేట టౌన్ ఎస్సై ఏ.వెంకటేశ్వర్లు... -ఈగల్ ఫోర్స్ బృందంతో కలిసి నార్కోటిక్స్ స్నిఫర్ పోలీసు జాగిలం"విక్కి" సహాయంతో తనిఖీలు...





నారాయణపేట,(డీకే చాటింపు): జిల్లాలో డ్రగ్స్,గంజాయి తదితర మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా నారాయణపేట పట్టణంలో టౌన్ ఎస్సై ఏ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ బృందంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నిఫర్ పోలీసు జాగిలం "విక్కి"సహాయంతో బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు,రెస్టారెంట్లు, అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, నిల్వ,విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ,డ్రగ్స్ సమాజాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమన్నారు. ప్రజలు ఎవరైనా గంజాయి,డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ /విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో
# ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జన్మదిన వేడుకలు



ఎల్బీనగర్,ఆగస్టు 6 (డీకే చాటింపు) ఎల్బీనగర్ ప్రాంతంలో గురువారం రోజున జయశంకర్ సార్ జన్మదిన వేడుకల్లో ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు అందోజు శ్రీనివాసాచారి పూలమాల తో సమర్పించి తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పడంలో, ఉద్యమానికి దిశానిర్దేశం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవని పేర్కొన్నారు. తన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం అంకితం చేసిన గొప్ప విద్యావేత్త, మేధావి, ఉద్యమకారుడు జయశంకర్ ని కొనియాడారు. ఈ యొక్క కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్ గ సుంకోజు కృష్ణమాచారి, అందోజు సత్యం చారి పులిగిల్ల శ్రీనివాసాచారి, పగిడోజు వెంకటేశ్వర్ల చారి, ఆందోజు దయానంద్ చారి యాదగిరి చారి, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు నాగోజు రామాచారి పర్వతం శ్రీనివాస్ ఆచారి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొండోజు వేణుగోపాల్ చారి నియోజకవర్గ కోశాధికారి బొల్లోజు నరసింహ చారి,నెలోజు శల్వాచారి, మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు రాపల్లి కృష్ణమాచారి, వెలకుర్తి చంద్రశేఖరాచారి, పడకంటి వెంకటాచారి, ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ సంఘాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కోశాధికారులు ఎంతోమంది ఉద్యమకారులు ఉపాధ్యాయ సంఘాలు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం, ఆగస్టు,7, 2026

# భద్రత లేని బతుకులు..!

ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాల నేపథ్యంలో భారతదేశ కార్మిక రంగంలో గణనీ యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు శాశ్వత ఉద్యోగాలు కార్మికులకు ఆర్థిక భద్రత, సామాజిక గౌరవాన్ని కుటుంబ స్థిరత్వాన్ని కల్పించేవి. కానీ, నేడు ఫిక్స్డటర్మ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ క్యాజువల్ వంటి నాన్ రెగ్యులర్ ఉద్యోగాల విస్తరణ వేగంగా పెరుగుతోంది. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రయివేటు సంస్థలు ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవడానికి ఈ విధానాన్ని ప్రభుత్వాలు ముందుకు తెస్తున్నాయి. దీని ఫలితంగా ఫిక్స్‌డ్‌టర్మ్, నాన్ రెగ్యులర్ ఉద్యోగాలు యాజమాన్యాలకు లాభదాయకంగా ఉన్నది. కార్మిక వర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురై అస్థిరతను ఎదుర్కొంటోంది. తెలంగాణ ఫ్యాక్టరీల శాఖ గణాంకాల ప్రకారం.. 2025 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 10,368 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 8,37,000 మందికి పైగా కార్మికులు ఉండగా, ఈ పరిశ్రమల్లో 83 శాతం మంది కాంట్రాక్ట్ (నాన్ రెగ్యులర్) కార్మికులు, 17 శాతం మాత్రమే శాశ్వత ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. వీరే శాశ్వత ఉద్యో గులు చేస్తున్న పనిని చేస్తున్నారు. కానీస శాశ్వత ఉద్యోగులకున్న వేతనం, పని గంటలు, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, ఇతర హక్కులు, సౌకర్యాలు నాన్ రెగ్యులర్ ఎంప్లాయీస్‌కు లేవు. మన రాష్ట్రంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఈ విధానం ద్వారా శాశ్వత ఉద్యోగాలను తగ్గించి తక్కువ వేతనాలు చెల్లిస్తూ, హక్కులు, సౌకర్యాలు లేకుండా కార్మికులను యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. వేతనం పొందే కార్మికుల స్థానంలో స్టైఫండ్ ఇచ్చి శాశ్వత ఉద్యోగులు చేసే పనిని చేయించుకుంటున్నారు. ఉపాధి భద్రత, కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, గ్రాట్యుటీ వంటి కార్మిక హక్కులను యాజమాన్యాలు కాలరాస్తున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల పరిశ్రమల్లో అనేక ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. గతేడాది సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భువనగిరి జిల్లా ప్రీమియర్ ఎక్స్‌ప్లోజీవ్ పరిశ్రమ ప్రమాదంలో నలుగురు కార్మికులు చనిపోగా ,పదహారు మంది గాయపడ్డారు, షాద్‌నగర్ ముర్గుల గ్లాస్ పరిశ్రమలో ఆరుగురు మృతి చెందగా ఇరవై మంది గాయపడ్డారు, జహీరాబాద్‌లోని మంగళా ట్యూబ్, అల్ఫ్‌లో ఒక్కొక కార్మికుడు డ్యూటీలోనే సేఫ్టీ లేక చనిపోగా ముంగి, పోలార్ పరిశ్రమల్లో చెయ్యి పోయి అంగవైకల్యంగా మారారు. మహీంద్రా ట్రాక్టర్స్ కంపెనీలో ఒక్కనెలలోనే కనీసం పది మంది గాయాల పాలయ్యారు. ఈ మధ్య ఒక కార్మికుడి కాలు ఫ్యాక్చర్ కావడం, సిఐఇ, మహింద్రా, మహింద్రా, అల్ఫ్, ముంగి, మంగళా ట్యూబ్, పోలార్, రాష్ట్రంలో అనేక పరిశ్రమల్లో కనీసం నెలలో పది మందికైన గాయలవుతున్నాయి. గ్లోబల్ సిటీ, స్మార్ట్ సిటీ పేరుతో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రచారార్భాటం చేస్తున్నది. పారిశ్రామికవేత్తలకు రాయితీల వర్షం కురిపిస్తున్నది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'ఆరు గ్యారెంటీల'ను గాలికొదిలేసింది. ఈ కాలంలోనూ అన్ని రంగాల్లోని కార్మికులు పోరాటంలోకి వస్తున్నారు. కార్మికవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల అసంతృప్తి క్రమంగా పెరుగు తున్నది. మేడ్చల్ జిల్లా షాహి ఎక్స్‌పోర్ట్ కార్మికులు పోరాడి కొంత వేతనాలు, సమస్యలను పరిష్కరించు కున్నారు. హెచ్‌బిఎల్, సంగారెడ్డి జిల్లాలోని బిస్లరీ కంపెనీ కార్మికులు పోరాటాలు చేస్తున్నారు. అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులపై పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులతో పాటు తక్కువ వేతనాలు చెల్లిస్తూ, పనిభారాలు పెంచుతూ యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాలకులు మారినా కార్మిక, ప్రజా సమస్యలు, కష్ట జీవుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. సమస్యల పరిష్కారం వైపు చిత్త శుద్ధి ప్రదర్శించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. సమ్మెలు, పోరాటాలు చేస్తే రాష్ట్రంలో పెట్టుబడులు రావని బెదిరిస్తున్నది. కార్మికోద్యమంపై నిర్భంధ చర్యలను కొనసాగిస్తున్నది. ఫిక్స్ టర్మ్ ఉద్యోగాల ప్రధాన సమస్య ఉద్యోగ భద్రత లేకపోవడం శాశ్వత ఉద్యోగాలు ఉండే స్థిరత్వం వీరికి ఉండదు ఒప్పంద కాల ముగిసిన తర్వాత తిరిగి ఉద్యోగం ఇస్తారో లేదో అనే అని అనిశ్చితి నిరంతరం వెంటాడుతుంది. దీంతో కార్మికులు నిరంతరం భయాందోళన మధ్య పని చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఉద్యోగం ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితిలో కుటుంబం ఉంటుంది. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేసినప్పటికీ వారికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంటోంది. ఇది ఉద్యోగ అనిశ్చితి కుటుంబం జీవితంపైన తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఉద్యోగ భద్రత అనేది కేవలం ఉపాధి కొనసాగింపునకు సంబంధించిన విషయం మాత్రమే కాదు అది కుటుం బ ఆర్థిక స్థిరత్వానికి పిల్లల విద్య, వైద్యం వృద్ధాప్య భద్రతకు గౌరవప్రదమైన జీవితానికి పునాది. ఉద్యోగం శాశ్వతంగా ఉంటుందని నమ్మకం ఉన్నప్పుడు కార్మికుల తన భవిష్యత్తును ప్రణాళికాబద్ధంగా నిర్మించుకోగలుగుతాడు. మానసికంగా ప్రశాంతంగా కుటుంబంతో జీవించగలడు. అది కార్మికుడి ఆలోచన స్వేచ్ఛను హక్కుల కోసం పోరాడే ధైర్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఎ

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు
ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# సామాన్యుడు.. సచివాలయానికెళితే..

ఎక్కిరాల కొండల రావు, హైదరాబాద్ సెక్రటేరియట్ ప్రతినిధి (డీకే చాటింపు): తెలంగాణ సచివాలయం.. అగ్రరాజ్యం అమెరికాలోని వైట్ హౌజ్ మాదిరిగా మనకూ ఈ శ్వేత సౌధం ఎంతో గర్వకారణం. రాష్ట్ర రాజధానిలో ఉన్న ఈ అందమైన భవనం ప్రభుత్వ పాలనకు ప్రధాన కార్యాలయం. మంత్రులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండే ముఖ్యమైన ప్రదేశం. హైదరాబాద్ మహానగరంతోపాటు జిల్లాల నుంచి ప్రజలు, వివిధ స్థాయి ప్రజాప్రతినిధులు నిత్యం ఎన్నో పనుల కోసం ఇక్కడికి వచ్చివెళుతుంటారు. దీంతో సందర్శకుల తాకిడి భారీగా ఉండటం వల్ల భద్రత కూడా కట్టుదిట్టంగా ఉంటుంది. చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది. మరి, ఇంతటి అద్భుతమైన కట్టడాన్ని ఆసాంతం తిరిగి చూసి ఆనందించాలని ఎవరికి మాత్రం ఉండదు చెప్పండి?. అయితే, ఈ గొప్ప నిర్మాణం లోపలికి అడుగు పెట్టాలంటే అందరికీ సాధ్యం కాదు. కొంత మందికి మాత్రమే అనుమతి లభిస్తుంది. దీనికోసం ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. సెక్రటేరియట్ లోపలికి వెళ్లాలంటే ముందుగా రిసెప్షన్‌లో విజిటర్ పాస్ తీసుకోవాలి. ఈ పాస్‌లను ప్రభుత్వ పని దినాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఇస్తారు. సరదాగా సచివాలయంలోకి వెళ్లి టైం పాస్ కోసం చూసొస్తానంటే పాస్‌లు ఇవ్వరు. ఏదైనా విభాగానికి వెళ్లి ఫలానా అధికారిని ప్రత్యేకమైన పని మీద కలవాలనుకుంటున్నాను అని స్పష్టంగా చెబితేనే, ఒక స్లిప్‌లో రాసిస్తేనే పాస్‌లు జారీ చేస్తారు. ఈ సమయంలో మన గుర్తింపు కార్డ్ (ఆధార్ తదితర కార్డులు) చూపించాలి. ఫోన్ నంబర్ ఇవ్వాలి. ఏ విభాగానికి వెళ్లాలనుకుంటున్నావో ఆ డిపార్ట్‌మెంట్ పేరు చెప్పాలి. అనంతరం పాస్‌లు జారీ చేస్తారు. ఆ విజిటింగ్ పాస్‌లు ఉన్నవారిని మధ్యాహ్నం మూడు గంటల నుంచి మాత్రమే లోపలికి వెళ్లనిస్తారు. ఈ క్రమంలో రెండు మూడు అంచెల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశాకే అనుమతిస్తారు. మొదటి అంచెలో విజిటింగ్ పాస్‌ను భద్రతా సిబ్బందికి చూపిస్తే వాళ్లు దాన్ని తనిఖీ చేసి కొంచెం చింపి మన చేతిలో పెడతారు. తర్వాత.. బాడీ స్కానర్, మెటల్ డిటెక్టర్‌లతో చెక్ చేస్తారు. హ్యాండ్ బ్యాగుల్లో వాటర్ బాటిల్స్ ఏమైనా ఉంటే వాటిని బయటికి తీసి చూపించాల్సి ఉంటుంది. రెండో అంచెలో కూడా దాదాపు ఇలాంటి తనిఖీలే చేస్తారు. అక్కడ సైతం మన లగేజ్ బ్యాగ్‌ల్లోని బాటిల్స్ ఏమైనా ఉంటే తీసి చూపించి భద్రతా సిబ్బంది ఓకే అన్నాకే సచివాలయం మెయిన్ బిల్డింగ్‌లోకి ఎంటరవ్వాలి. దీర్ఘచతురస్రాకారంలో చూడచక్కగా కట్టిన ఈ సెక్రటేరియట్‌లో దాదాపు 10 అంతస్తులు ఉన్నాయి. మధ్యలో ఖాళీ ప్లేస్, అందులోని పచ్చిక ఆకట్టుకునేలా ఉంటాయి. ప్రతి అంతస్తులోనూ మంత్రుల పేషీలు, ఐఏఎస్ ఆఫీసర్ల క్యాబిన్లు ఒకదాని తర్వాత ఒకటి వస్తుంటాయి. ప్రతి అంతస్తుకూ, ప్రతి గదికీ స్పష్టంగా నంబర్లు వేశారు. పై అంతస్తులకు వెళ్లటానికి లిఫ్టులు, మెట్లు పుష్కలంగా ఏర్పాటుచేశారు. సెక్యూరిటీ కోసం అడుగడుగునా సీసీ కెమెరాలను బిగించారు. సచివాలయంలోకి వెళ్లాక మన ప్రతి కదలికా ఆ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఏదైనా ఒక విభాగానికి వెళితే అక్కడి ఆఫీసర్లను కలవటానికి కూడా ప్రత్యేకంగా విజిటింగ్ అవర్స్ ఉంటాయి. ముఖ్యమంత్రి పేషీ ఉండే 6వ అంతస్తులో మొత్తం తిరిగి చూడటానికి సామాన్యులకు ప్రవేశంలేదు. కొంత వరకు మాత్రమే పర్మిషన్ ఇస్తారు. ఆ ఫ్లోర్‌లోకి వెళ్లాక మనం ఎవరినైతే కలవాలనుకుంటున్నామో ఆ అధికారి పేరు అడుగుతారు. పేరు చెప్పాక అతనికి ఫోన్ చేయమంటారు. ఆ వ్యక్తితో పోలీసులు మన ఫోన్‌లోనే మాట్లాడి ధ్రువీకరించుకున్నాక అనుమతిస్తారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సచివాలయంలో భద్రతను బాగా పకడ్బందీ చేశారు. అంతకుముందు.. సందర్శకులను పెద్దగా ఆంక్షలేమీ లేకుండానే లోపలికి వెళ్లనిచ్చేవారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సైతం కొన్నాళ్లు ఇలాంటి విధానమే ఉండేదని, ఇటీవల జరిగిన ఒకటీ రెండు సంఘటనల తర్వాత సచివాలయంలోకి ప్రవేశంపై పరిమితులు విధిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. మీడియావాళ్లు కూడా ఎప్పుడు పడితే అప్పుడు సెక్రటేరియట్‌లోకి వెళ్లటానికి అవకాశంలేదు. మంత్రులు తమ విభాగాల్లో ప్రెస్‌మీట్‌లు పెట్టినప్పుడు మీడియాకి అనుమతి ఇస్తారు. ఇతర ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు సచివాలయం బయట మీడియా సెంటర్ ప్రత్యేకంగా ఉంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ తదితర మీడియా సిబ్బంది ఆ కేంద్రంలోనే వేచి ఉండాలి. సచివాలయంలోని అన్ని అంతస్తులు, అన్ని విభాగాలూ చూసి రావాలంటే కనీసం ఒక రోజైనా పడుతుంది. బయటకు వచ్చేటప్పుడు ఎలాంటి తనిఖీలూ చేయరు.



# సచివాలయంలో బోనాల సందడి









ఎక్కిరాల కొండల రావు, హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి (డీకే చాటింపు): ఆషాఢ మాసం సందర్భంగా హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం బోనాల సందడి నెలకొంది. నిత్యం ఉదయం పదీ పదకొండు గంటల నుంచి సాయంత్రం ఐదారు గంటల వరకు అధికారిక విధుల్లో తలమునకలై ఉండే సెక్రటేరియట్, అసెంబ్లీ, లోక్ భవన్ ఆఫీసర్లు.. ఆ పనులను కాస్త పక్కపెట్టి ఈ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవార్ల వేషధారులు, శివసత్తులు, భక్తులు బోనాలను నెత్తి మీద, ఆయుధాలను చేతుల్లో ధరించి వేడుకగా సచివాలయ ఆలయ ఆవరణలోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి గుడికి చేరుకున్నారు. డప్పులు, డీజేల చప్పుళ్ల మధ్య, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నృత్యాలతో సచివాలయ, అమ్మవారి ఆలయ పరిసరాలను హోరెత్తించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. సచివాలయం లోపలి నుంచి ప్రారంభమైన ఈ జాతర.. అమ్మవారి కోవెల వరకు కోలాహలంగా సాగింది. ప్రజాప్రతినిధులు, మహిళా, పురుష ఉద్యోగులు, పోలీసులు, మీడియా సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ.. బోనాల జాతర కోసం విస్తృత ఏర్పాట్లు చేసింది. నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహాన్ని, అమ్మవారి ఆలయాన్ని పూలదండలతో అంగరంగ వైభవంగా అలంకరించారు.బోనాల జాతర సందర్భంగా సచివాలయ సందర్శకులకు, ఉద్యోగులకు, పోలీసులకు, సిబ్బందికి, మీడియావారికి ఉచితంగా అన్నప్రసాద వితరణ చేశారు.

# ఆచార్య జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగించాలి

## - డాక్టర్ వేములవాడ మదన్మోహన్అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం



ఎల్బీనగర్, ఆగష్టు 6 (డీకే చాటింపు) ఆచార్య జయశంకర్ సార్ 92 వ జయంతి సందర్భంగా హైదరాబాద్ యల్ బి నగర్ కూడలి వద్ద జరిగిన వేడుకల లో పాల్గొన్న రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగించాలని తెలంగాణ జాతి పితగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అత్యంత ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ తో పాటుగా రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు బ్రహ్మశ్రీ ఆకోజు కిషన్ , బ్రహ్మశ్రీ పులిగిళ్ళ శ్రీనివాసా చారి , రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మశ్రీ నెల్లోజు సాల్వాచారి , రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యులు బ్రహ్మశ్రీ చిలుకూరి రామాచారి , హైదరాబాద్ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ పర్వతం శ్రీనివాసా చారి ,యల్ బి నగర్ సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ ఆందోజు శ్రీనివాసా చారి , ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ కొండోజు వేణు గారు తదితర నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు



జనగామ ఆగస్టు 6 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి పసునూరి దేవేందర్ తెలంగాణ కోసం జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన జనగామ నగరంలో తెలంగాణ సిద్ధాంతకర్త,ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జయ శంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తొలి బీజాలు వేసి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు బలమైన సిద్ధాంతాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.

# సర్ విషయంలో అధికారులకు సహకరిస్తాం

## డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్



మహేశ్వరం, ఆగష్టు 6 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ లోని సర్, ఫార్మ్ లు కొన్ని పెండింగ్ లో ఉన్న వాటి పై - కాలనీ బస్తిలల్లో తిరిగి -మిగత ఓటర్స్‌ని కూడ విస్టింగ్ చేయాలని అన్ని కంప్లిట్ చేయాలని, ఆఫీసర్ తో పాటు మేము కూడ వెంటఉండి సహకరిస్తాముఅని, సరూర్‌నగర్ ఎమ్మార్వో ఆఫీసర్ వేణుగోపాల్ కి తెలియచేసిన డాక్టర్స్ కాలనీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ , డాక్టర్స్ కాలనీ డివిజన్ సీనియర్ నాయకు జిల్లెల కృష్ణ, షఫీ భాయ్, నహీం భాయ్,ఇమ్రాన్ అలీ,కొయడ జనార్ధన్ గౌడ్,కండటి జంగారెడ్డి, మొగిళ్ళ మల్లేష్, కడియల గోపాల్,కుర్మతి లక్ష్మయ్య,మాదాసు వెంకటేష్,మహబూబ్,సాయిమరియు పాల్గొన్నారు.

# జనహిత అన్నపూర్ణ 425 వ సారి అన్న దాన కార్యక్రమం...

బెల్లంపల్లి (డీకే చాటింపు ) గురువారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 425 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 425 వ సారి దాత కీ.శే. సూర దినేష్ జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు యాచకులకి, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు,అందచేశారు.మున్సిపల్ కౌన్సిలర్ నిచ్చుకోల వంశీ, దాత కుటుంబ సభ్యులు మరియు మిత్రులు జనహిత సేవా సమితి కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్ కార్యవర్గ సభ్యులు నిచ్చుకోల గురుస్వామి,ఎల్లాల పోశం, బోనాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# పేపర్ మిల్లు ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ విజయం



**రాజమండ్రి,** : రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ ఘన విజయం సాధించింది. వైసీపీ, టీడీపీ కూడా పోటీ చేసిన ఈ త్రిముఖ పోరులో జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యూనైటెడ్ ఫ్రంట్ 258 ఓట్లతో గెలుపొందింది. వైఎస్సార్ సీపీకి 228 ఓట్లు రాగా, టీడీపీకి చెందిన టీఎన్టీయూసీ 220 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో కూటమి పార్టీలయిన టీడీపీ, జనసేన విడివిడిగా పోటీచేయడం చర్చనీయాంశమైంది. ఓట్ల శాతంలో ఏపీలో మూడో స్థానంలో ఉండే జనసేన పార్టీ ఈసారి సంచలనం సృష్టించింది. కార్మిక సంఘాల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీని వెనక్కి నెట్టి మరీ ఘన విజయం సాధించింది. క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీ బలోపేతం అవుతుంది అనడానికి ఇది నిదర్శనమంటూ ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో జనసేన ఫ్రంట్ ఘన విజయం సాధించి, సంచలనం సృష్టించింది. రాజమండ్రి ఆంధ్ర పేపర్ మిల్లు కార్మిక సంఘాల ఎన్నికల్లో త్రిముఖ ఫోరు జరిగింది. జనసేన ఫ్రంట్, వైసీపీ కూటమి, టీడీపీ మూడు పార్టీలు ఈ ఎన్నికల్లో పోటీచేశాయి. జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యునైటెడ్ ఫ్రంట్ ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి ఘన విజయం సాధించింది. ఈ పోటీల్లో కూటమి పార్టీలు విడివిడిగా పోటీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో జనసేన, ఏఐటీయూసీ, ఎఫ్ఐటీయూ యునైటెడ్ ఫ్రంట్ 258 ఓట్లతో గెలుపొందింది. వైఎస్సార్ సీపీ కూటమి 228 ఓట్లతో రెండో స్థానంలో ఉండగా, టీడీపీకి చెందిన టీఎన్టీయూసీ 220 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ విజయం అనంతరం జనసేన పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. తొలి విజయం సాధించామంటూ ఆనందం వ్యక్తం చేశారు. తాము ఒంటరిగా కూడా పోటీ చేసి విజయం సాధించగలమని నిరూపించామంటూ జనసేన నాయకులు ఆ పార్టీ జెండాలతో సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. ఈ కార్మిక సంఘాల ఎన్నికల్లో విజేతలు నిలిచిన జనసేన ఫ్రంట్ నాయకులకు రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అభినందనలు తెలిపారు. అయితే, కూటమి పార్టీ నాయకులు ఇలా విడివిడిగా పోటీ చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితో 2024 ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించగా.. ఇప్పుడు కార్మిక సంఘాల ఎన్నికల్లో ఇలా ఎవరికి వారు పోటీ చేయడం ఆసక్తికరంగా మారింది. త్వరలోనే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో.. అందులో కూడా ఇలానే విడివిడిగా పోటీ చేస్తారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# చిగురుమామిడి లో ఘనంగా జయశంకర్ సార్ జయంతి వేడుకలు



తెలంగాణ జాతిపిత ఉద్యమ నేత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి కార్యక్రమాలు చిగురుమామిడి మండలంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అకంపేట గ్రామంలో 1934 ఆగస్టు 6వ తేదీన లక్ష్మీకాంతరావు -మహాలక్ష్మి దంపతులకు జయశంకర్ సార్ జన్మించారు ఆయన చిన్ననాటి నుండే అభ్యుదయ భావాలు కలవాడై చదువులో చాలా చురుకుగా ఉండేవాడు తెలుగు హిందీ ఉర్దూ ఇంగ్లీష్ భాషల్లో మంచి పట్టు సంపాదించి ఎన్నో డిగ్రీలు చేశారు అలాగే ఆర్థిక శాస్త్రంలో పిహెచ్డి చేసి ప్రిన్సిపల్ గా, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ గా చేశారు 1952లో నాన్ ముల్కీ ఉద్యమంలో సాంబార్ ఇడ్లీ గో బ్యాక్ లో ఉద్యమంలో 1969లో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు అలాగే మలిదశ ఉద్యమంలో ఆయన వ్యూహరచనల ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కొరకై ఎన్నో వ్యాసాలను రాసి మరెన్నో ప్రసంగాలను ఇచ్చి తెలంగాణ యువతలో రాజకీయ నాయకులలో ఉద్యమ స్ఫూర్తి నింపారు ఆజన్మ బ్రహ్మచారిగా అహర్నిశలు తెలంగాణ రాష్ట్ర సాధనకై పోరాడారు అంతటి మహనీయుడు తెలంగాణ రాక ముందే 2011 జూన్ 21 తేదీన మరణించారు అంతటి మహనీయుని జయంతి మరియు వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని జయశంకర్ సార్ తెలంగాణకు జాతిపితగా అధికారికంగా ప్రకటించాలి,పాఠ్య పుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను ప్రచురించాలి,ప్రతి మండల కేంద్రంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని,వారి ఆలోచన విధానం ప్రకారం తెలంగాణలో కొత్త సంస్కరణలు చేసి నవతెలంగాణను నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర సాధనకై విశ్వబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉంది జయశంకర్ సార్ కావచ్చు శ్రీకాంతచారి కావచ్చు మారోజు వీరన్న కావచ్చు ఇంకా ఎంతో మంది విశ్వబ్రాహ్మణుల పోరాటం ఉంది చేసుకోవడానికి పనులు లేక ఎన్నో ఇబ్బందులపలు అవుతున్న 50 సంవత్సరాలు దాటిన విశ్వబ్రాహ్మణులకు 5000 రూపాయల పింఛను ఇవ్వాలని, వృత్తి చేసుకునే వారికి 300 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మండలంలో ని సుందరగిరి గ్రామంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో రాజకుమార్ తో పాటు ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి, ఉపాధ్యక్షులు అనువోజు బాలకృష్ణమాచారి, చొప్పదండి సుధాకర్, వడ్లూరి కుమారస్వామి, రంగు రాజేందర్, గొల్లపల్లి సత్యనారాయణ, అనువోజు చిరంజీవి, గుగ్గిల ఆంజనేయులు, వడ్లూరి నరేష్, చొప్పదండి సూర్య ప్రకాష్, పోలోజు సదాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, సుందరగిరి సంఘ అధ్యక్షులు కందుకూరీ సత్యనారాయణ , ఉపాధ్యక్షులుశ్రీరామోజు రాములు, ప్రధాన కార్యదర్శి రామోజీ ఆంజనేయులు,మండల నాయకులు రామోజీ కృష్ణమాచారి, విశ్వపతి వెంకటేష్, కాశబోయిన రాజు,కుతాడి కొమురయ్య,నిలిగొండ కిషన్,నిలిగొండ సదానందం,మల్లం శ్రీనివాస్,దుడ్డేలా వెంకటి,రాజిరెడ్డి,వంగ కనకయ్య,సందబోయిన రాజు,సంపతి,తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# ఒక వైపు రాయలసీమ... మరో వైపు ఉత్తరాంధ్ర... అంతు చిక్కని జగన్ వ్యూహం



**విజయవాడ జూలై 31 :** ప్రాంతీయ సెంటిమెంట్లను రగిల్చి రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం ప్రజాస్వామ్యంలో కొత్తేమీ కాదు. అయితే, ఒకే రాజకీయాధికారం కోసం ఒకే పార్టీ ఒకే సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో భిన్నమైన, వివాదాస్పదమైన డిమాండ్లను తెరపైకి తెచ్చే వ్యూహాలు అరుదుగా కనిపిస్తాయి. వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం అమలు చేస్తున్నట్లుగా భావిస్తున్న వ్యూహం సరిగ్గా ఈ తరహాకే చెందినది. ఒకవైపు రాయలసీమ అన్యాయం పేరుతో ప్రత్యేక రాష్ట్ర హోదా అనే నినాదాలను సజ్జల రామకృష్ణారెడ్డి వంటి నేతల ద్వారా ప్రోత్సహిస్తూ, మరోవైపు ఉత్తరాంధ్రలో ధర్మాన ప్రసాదరావు వంటి సీనియర్ నేతలతో ప్రత్యేక ఉత్తరాంధ్ర సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజల వాస్తవ అవసరాలు, వారి ఆలోచనా ధోరణితో సంబంధం లేకుండా కేవలం సొంత మీడియా, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల ద్వారా తమ అభిప్రాయాలను ప్రజలపై రుద్దవచ్చున్న ధీమా ఈ తరహా వ్యూహాలకు మూలధనం. సమాజంలో ప్రాంతీయ అసమానతలు ఉన్నప్పుడు వాటిని పరిష్కరించే సమగ్ర ప్రణాళికలు రూపొందించడం బాధ్యతాయుతమైన రాజకీయం అవుతుంది. కానీ, ప్రాంతాల మధ్య వైషమ్యాలను రగిల్చడం పొలిటికల్ ప్రాక్సీ డ్రామాను తలపిస్తోంది. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేస్తే తమకు రాజకీయంగా మేలు అనుకుంటున్నారు. ఈ తరహా ప్రాంతీయ విద్వేష వ్యూహం రాజకీయంగా తగలబెట్టేలా మారే ముప్పు ఎక్కువ. 2019-2024 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రాజధానుల ప్రయోగం దీనికి ప్రత్యక్ష నిదర్శనం. పరిపాలనా వికేంద్రీకరణ అనే ఆకర్షణీయమైన పదబంధం వెనుక అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ప్రాంతాల మధ్య ప్రాంతీయ విభజనలను రగిల్చారనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంది. ఫలితంగా, ఏ ఒక్క ప్రాంతంలోనూ వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన విశ్వసనీయత దక్కకపోగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఒకసారి దెబ్బతిన్న వ్యూహాన్నే మళ్లీ కొత్త సీసాలో పాత మద్యంలా మార్చి ప్రయోగించడం పార్టీ భవిష్యత్తుకే ప్రమాదకరం. తమపై తామే పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకోవడం లాంటి ఈ తీరు వల్ల గతంలో వచ్చిన చేదు అనుభవాల నుంచి నాయకత్వం పాఠాలు నేర్చుకోలేదనే సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. మూడు రాజధానుల అంశంపై ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఇప్పటికే రాజకీయంగా తీవ్ర నష్టం వాటిల్లగా, ఇప్పుడు మళ్లీ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ఉద్యమాల పేరుతో ప్రాంతీయ కార్డ్‌ను ఉపయోగిస్తే మిగిలిన కొద్దిపాటి రాజకీయ స్థానం కూడా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఓటర్లు వైరల్ కంటెంట్‌కే పరిమితం కావడం లేదు.. గందరగోళం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వ్యూహాలు సుదీర్ఘకాలంలో వికటిస్తాయి. సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలకే ప్రజలు ప్రాధాన్యమిస్తున్న తరుణంలో, ప్రాంతాల మధ్య విద్వేషాలను ప్రోత్సహించే విధానం వైఎస్సార్‌సీపీని మరింత రాజకీయంగా ఒంటరిని చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా....





బెల్లంపల్లి (డీకే చాటింపు ) వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంచిర్యాల జోన్‌లోని బెల్లంపల్లి సబ్-డివిజనల్ (ఏసీపీ) కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయ ఆవరణను పరిశీలించి, ఏసీపీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు,వాటి పురోగతి, నిందితుల అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, ఆలస్యానికి గల కారణాలను ఏసీపీని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను నాణ్యతతో కూడిన దర్యాప్తు నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,ప్రజల్లో పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, నేరాల నియంత్రణకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని,వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బందికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీసు అధికారులతో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల్లో అంతర్గత అసహనం



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం పటిష్టమైన పాలనపై దృష్టి పెట్టినప్పటికీ, తెరవెనుక పార్టీ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి ఇప్పుడు అధిష్ఠానానికి సరికొత్త సవాల్‌గా మారుతోంది. అయితే, ఈ అసంతృప్తికి ప్రభుత్వంపై వ్యతిరేకత కానీ, నిధుల కొరత కానీ కారణం కాకపోవడం ఇక్కడ అసలు ట్విస్ట్. క్షేత్రస్థాయిలో తమకు దశాబ్దాలుగా శత్రువులుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రత్యర్థులను ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీయకపోగా, అయాచితంగా కొన్ని నిర్ణయాల వల్ల వారు మరింత బలోపేతం అవుతుండటమే ఈ అసంతృప్తికి ప్రధాన కారణం. ఈ అంతర్గత అసహనానికి తాజా ఉదాహరణగా గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు నిలిచారు. గన్నవరం నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు, ఆయనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే ఒక ప్రముఖ కన్స్ట్రక్షన్ సంస్థకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ పెండింగ్ పనుల కాంట్రాక్ట్ దక్కడంపై వెంకట్రావు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తమ కళ్ల ముందే ప్రత్యర్థులు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా మళ్లీ ఆర్థికంగా పుంజుకుంటుంటే, నియోజకవర్గంలో తమ రాజకీయ ఉనికి ఏమవాలనే ఆందోళన ఆయనను బహిరంగంగానే మాట్లాడేలా చేసింది. వెంకట్రావు లేవనెత్తిన ఈ అంశం కేవలం గన్నవరానికి మాత్రమే పరిమితం కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ టీడీపీ ఎమ్మెల్యేల అంతర్గత సమస్య ఇదేనని పొలిటికల్ సర్కిల్స్ లో విశ్లేషణలు సాగుతున్నాయి. గత ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర అణచివేతకు గురై, ఆస్తులు నష్టపోయి, పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలపై నమోదైన పాత కేసులు ఇప్పటికీ పూర్తిగా పరిష్కారం కాలేదు. ఒకవైపు సొంత కేడర్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతుంటే, మరోవైపు ప్రత్యర్థి పార్టీ నేతలు అధికార యంత్రాంగంలోని కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా తమ వ్యాపారాలను, ఆర్థిక సామ్రాజ్యాలను కాపాడుకోవడం ఎమ్మెల్యేలకు మింగుడుపడటం లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో సహజంగానే అధికారులు పాత కాంట్రాక్టర్ల పెండింగ్ పనులను క్లియర్ చేయడం, సాంకేతిక కారణాల వల్ల పాత సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంటుంది. కానీ, రాజకీయ క్షేత్రంలో ఇది తప్పుడు సంకేతాలు పంపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయకపోతే, వారు రాబోయే రోజుల్లో మళ్లీ పుంజుకుని తమపైకే రాజకీయంగా దాడికి వస్తారనే భయం టీడీపీ ఎమ్మెల్యేలలో స్పష్టంగా కనిపిస్తోంది. అధికారుల నిర్ణయాలు తమ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని వారు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్వహణ, పాలనాపరమైన సంస్కరణలపైనే పూర్తి దృష్టి పెట్టిన టీడీపీ హైకమాండ్‌కు, సొంత పార్టీ శాసనసభ్యుల మనోభావాలను , క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలను గమనించడానికి తగినంత తీరిక లేనట్లు కనిపిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే భావన కేడర్‌లో బలపడితే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు నేరుగా అసెంబ్లీ లోపల లేదా బహిరంగ వేదికలపై అసంతృప్తిని వెళ్లగక్కకముందే అధిష్ఠానం జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. టీడీపీ అగ్రనాయకత్వం ఈ తీవ్రతను గుర్తించి, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమస్యలను ఆలకించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది. బ్యూరోక్రసీ తీసుకునే నిర్ణయాలు పార్టీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారకుండా ఒక స్పష్టమైన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ సీనియర్ నేతలు అనుకుంటున్నారు. చంద్రబాబుకు తీరక లేదు... లోకేష్ బిజీ బిజీ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, ఈ మంచితనం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో కష్టపడిన కీలక నేతలకు ఒక కొత్త తలనొప్పిగా మారింది. తెలుగుదేశం పార్టీ లోని కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలలో అంతర్గత అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వంటి నేతలు ఇటీవల బహిరంగంగానే తమ ఆవేదనను వెళ్లగక్కడం దీనికి నిదర్శనం.

# బోనాల వేడుకలో పాల్గొన్న:- చిలుక మధుర ఉపేందర్ రెడ్డి



మహేశ్వరం, ఆగస్టు 6 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలోని హరిపురి కాలనీ మహిళా మండలిబి వారి ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు సుకన్య, వాణి, పద్మజ, లక్ష్మీ, అనిత, శోభ రాణి,పద్మావతి, ఉమా, సుజాత, శోభ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ టు కొత్తపల్లి నాలుగు వరుసల

# రోడ్డు విస్తరణకు హైకోర్టు బ్రేక్




కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామం నుండి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ వ్యవహారంలో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో నాలుగు వరసల రహదారి విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నాలుగు వరుసల రహదారి విస్తరణ అంశంపై దాఖలైన రిట్ పిటిషన్లపై బాధితులకు స్టేటస్ కో (యథాతథ స్థితి) కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉపశమనం కల్పించింది. మొదట ప్రధాన పిటిషనర్ కందుకూరి లక్షణాచారి, కక్కర్ల బాలయ్య, కెమ్మసాగరం వెంకటయ్య, ఓరుగంటి భారతీ దేవి, వంతడుపుల మల్లయ్య, పిట్టల రమేష్, గైని శ్రీనివాస్, బోల్లబతిని రాజేశం, మొలుగూరి వెంకటాద్రి, వంతడుపుల వినయ్, సిలుమోజు యశోద మొదలైన 11 మంది దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఆగస్ట్ 4న విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద గారు 11 మంది మందికి చెందిన ఆస్తులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు స్టేటస్ కో జారీ చేశారు. దీంతో పిటిషన్ బాధితులకు హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. వాదన ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి గారికి, సర్పంచ్ గారికి ఇండ్ల కూల్చివేతపై ఎలాంటి అధికారాలు ఉన్నాయని గ్రామ ప్రజలకు నోటీసులు జారీ చేశారని తెలిపారు , అధికారులు చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా, భవిష్యత్తులో 4, 6 వరుసల రహదారి నిర్మాణం బైపాస్ ద్వారా రోడ్డు నిర్మిస్తే బాగుంటందనే విషయం ఆలోచించకుండ , నష్టపరిహారం చెల్లించకుండానే రోడ్డు విస్తరణ పేరుతో తమ ఆస్తులపై చర్యలకు సిద్ధమవుతున్నారని కోర్టు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. పిటిషనర్ల తరపున న్యాయవాదులు వి.వెంకట సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించడం జరిగింది. దీనిపై స్పందించిన హైకోర్టు తదుపరి విచారణ వరకు ఆస్తులపై కూల్చివేయడం స్వాధీనం లేదా ఇతర జోక్య చర్యలు చేపట్టరాదని స్పష్టం చేస్తూ స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 11 2026 కు వాయిదా పడింది. ఈ నాలుగు వరసల రహదారి విస్తరణ అంశంపై పిటిషనర్లుకు హైకోర్టులో స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేయడం హుస్నాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశశీ గా మారింది. చట్టబద్ధమైన ప్రక్రియ ప్రజల అభ్యంతరాల పరిశీలన, భవిష్యత్తులో4,6 వరుసల రోడ్డుకు, నేషనల్ రోడ్డుకు, గ్రీన్ ఫీల్డ్ రహదారికి బైపాస్ రోడ్డు అనుకూలమని ప్రతిపాదన, అదేవిధంగా ఉత్తర తెలంగాణ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తులో మంచి ప్రదాన రాష్ట్ర, జాతీయరహదారి నిర్మించాలంటే బైపాస్ రోడ్డు ద్వారానే నిర్మించాలని,తగిన నష్టపరిహారం వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయని న్యాయవార్గాలు అభిప్రాయపడుతున్నారు.

# ఇంకా తేలని రాష్ట్రాల పంచాయితీ

## పుష్కర కాలమైన బదిలీ కాని ఆస్తులు

**హైదరాబాద్,** : రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లైనా ఇంకా రెండు రాష్ట్రాల మధ్య ప్రభుత్వ భవనాల పంపకాలు పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ భవనాలను ఆంధ్రప్రదేశ్ సర్కా?ర్ ఇంకా తెలంగాణకు అప్పగించలేదు. కొన్ని భవనాలను ఖాళీ చేసినప్పటికీ వాటిని అప్పగించలేదు. మరికొన్ని భవనాల్లో ఏపీ ఉద్యోగులు కొనసాగుతున్నారు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ సహా కీలక ఆస్తుల బదిలీ కూడా పెండింగ్‌లోనే ఉంది. ఆస్తుల విభజన, నదీ జలాల పంపకం వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పుష్కర కాలం పూర్తి అయిపోయింది. హైదరాబాద్ నగరం ఉమ్మడి రాజధానిగా 10 ఏళ్ల పాటు కొనసాగింది. ఆ గడువు కూడా తీరిపోయి 2 ఏళ్లు గడిచింది. అయితే ఈ 12 ఏళ్లు పూర్తి అయినా రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన అంశం ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ మధ్య పలు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ భవనాల బదిలీ ముందుకు సాగడం లేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం హైదరాబాద్‌లోని మొత్తం 2,565 ప్రభుత్వ భవనాల్లో 589 భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. మిగిలిన 1,976 భవనాలను తెలంగాణకు అప్పగించారు. అయితే ఉమ్మడి రాజధాని గడువు ముగిసిన తర్వాత ఈ భవనాలను తెలంగాణకు అప్పగించాలని అప్పుడే తేల్చి చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. పాటిగడ్డ, బంజారాహిల్స్, కుందన్‌బాగ్, ఎర్రమంజిల్, సైఫాబాద్, మలక్‌పేట్, ఖలాదేరా, మదన్నపేట వంటి ప్రాంతాల్లో ఉన్న ఈ భవనాలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతున్నాయి. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. మొత్తం 589 భవనాల్లో 221 భవనాల్లో ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా.. మరో 368 భవనాలను వారు ఖాళీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా అప్పగించలేదు. రాష్ట్ర విభజన



జరిగిన తర్వాత పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేందుకు 2024 జూలై 6వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం అయి చర్చించారు. అనంతరం అధికారులు, మంత్రుల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. అయితే ఈ మీటింగ్ జరిగి కూడా 2 ఏళ్లు గడిచినా ఆస్తుల పంపకాల విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వంటి కీలక ప్రభుత్వ భవనాల బదిలీ కూడా ఏపీ, తెలంగాణ మధ్య వివాదంగానే కొనసాగుతోంది. ఈ భవనాన్ని తిరిగి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా.. షెడ్యూల్–9, షెడ్యూల్–10 కింద ఆస్తుల విభజనతో పాటు ఇతర పెండింగ్ అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో ఆ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఆధీనంలో ఉన్న భవనాల్లో మలక్‌పేట్‌లోనే అత్యధికంగా 308 భవనాలు ఉన్నాయి. పాటిగడ్డలో 95, ఎర్రమంజిల్‌లో 67, కుందన్‌బాగ్‌లో 44, బంజారాహిల్స్‌లో 33, ఖలాదేరాలో 13, సైఫాబాద్‌లో 12, పంజాగుట్టలో 9, మదన్నపేటలో 8 భవనాలు ఇప్పటికీ ఏపీ వద్దే ఉన్నాయి. ఆస్తుల విభజనతో పాటు నదీ జలాల పంపకం, ప్రాజెక్టుల అనుమతులు వంటి పలు కీలక అంశాలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రాష్ట్ర విభజనకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# అసెంబ్లీ హామీల్లో సగమే అమలు

హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పుష్కరం పూర్తయింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తర్వాత 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ సారథ్యంలో పాలన సాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రస్తుతం పాలన సాగుతోంది. అయితే రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రులు, మంత్రులు ఇచ్చిన హామీల అమలు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు సగం హామీలే నెరవేరాయని శాసనసభ హామీల అమలు కమిటీ స్వయంగా వెల్లడించింది. గడిచిన 12 ఏళ్లలో పాలకులు అసెంబ్లీ వేదికగా 2,266 హామీలు ఇచ్చారు. వీటిలో ఇప్పటి వరకు 1,092 అమలయ్యాయి. 1,174 హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో 750 హామీలు గత ప్రభుత్వ కాలంలో ఇచ్చినవి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు ప్రజలకు ఇచ్చే నమ్మకం. అవి నెరవేరకపోతే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇన్ని సంవత్సరాలు గడిచినా సగం హామీలు పెండింగ్‌లో ఉండటం చట్టసభపై అలసత్వం నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది. గత ప్రభుత్వ హామీలు ఎక్కువగా మిగిలిపోవడం ఒక వైపు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సమీక్షించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలో జరిగిన సమావేశంలో పెండింగ్ హామీలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది సానుకూల అడుగు. అయితే కేవలం సమీక్షతో సరిపోదు. సమయ పట్టిక, బాధ్యతలు నిర్ణయించి, పురోగతిని క్రమం తప్పకుండా ప్రజలకు తెలియజేయాలి. హామీలు అమలు కాకపోవడంతో ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరదు. అభివృద్ధి పథకాలు, సేవలు, స్థానిక సమస్యల పరిష్కారం ఆలస్యమవుతాయి. అసెంబ్లీలో ఇచ్చే హామీలు చట్టబద్ధమైన బాధ్యతగా పరిగణించబడాలి. లేకపోతే రాజకీయ ప్రకటనలు మాత్రమేగా మిగిలిపోతాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. పెండింగ్ హామీలను ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించాలి. కొన్ని వెంటనే అమలు చేయగలిగేవి, కొన్ని దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమైనవి. విభాగాల మధ్య సమన్వయం పెంచాలి. అమలు స్థితిని క్రమం తప్పకుండా అసెంబ్లీకి, ప్రజలకు నివేదించాలి. పారదర్శకత పెరిగితే నమ్మకం పునరుద్ధరణకు అవకాశం ఉంటుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టుకోలేమా వర్షపు నీటిని ఒడిసిపట్టడంలో పాలకుల వైఫల్యం మరొక ఎత్తు. రాజకీయ నాయకులు కేవలం నీటి కేటాయింపులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప వస్తున్న వరదను ఎలా నిల్వ చేయాలో ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రాలపై బురదజల్లే బదులు రాష్ట్రంలోని నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అత్యవసర పరిస్థితి ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు లేదా వాయుగుండాలు ఏర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం కంటే తెలంగాణలో భారీ వర్షాలు పడటం గమనించదగ్గ విషయం. సముద్రతీరంలో ఉన్న విశాఖపట్నంలో కేవలం ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ, హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని అనేక జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల



ప్రకారం రాబోయే రెండు మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాలు నీట మునిగి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. వర్షాల తీవ్రత కారణంగా హైదరాబాద్ నగరంలో ఐటీ ఉద్యోగులను సాయంత్రం వేళల్లో ఇళ్లకు త్వరగా పంపించివేయాలని పోలీసు కమిషనర్ స్వయంగా విజ్ఞప్తి చేశారు. రాత్రి సమయంలో భారీ వర్షం పడితే మహానగరం మరోసారి నీట మునిగిపోయే ప్రమాదం ఉంది. ఇది హైదరాబాద్ కీర్తిని తగ్గించడం కాదు, ప్రతి వర్షాకాలంలోనూ పునరావృతమవుతున్న చేదు వాస్తవం అని అందరికీ తెలుసు. గట్టిగా వాన పడిన ప్రతిసారీ నగరాలు, పల్లెలు నీట మునుగుతున్నాయే తప్ప ఆ వరద నీటిని ఎక్కడికి మళ్లించి భద్రపరుచుకోవాలో అర్థం కాని దుస్థితి నెలకొంది. తెలంగాణ వ్యాప్తంగా వేలాది ఎకరాల పంట పొలాలు, రోడ్లు జలమయం అవుతున్నా పాలకులకు ఇంకా నీళ్ల కోసం ఆరాటమే మిగులుతోంది. నీటి చుట్టూ రాజకీయాలు చేస్తూనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని నిందించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారింది. వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. పొరుగు రాష్ట్రంపై ఆరోపణలు గుప్పించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించవచ్చని నాయకులు భావిస్తున్నారు. కానీ ప్రకృతి ఇస్తున్న సంపదను కాపాడుకోవడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ నిరసనలు కొనసాగుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించే బదులు ముంచెత్తుతున్న వరద నీటిని ఎక్కడికక్కడ కాలువలు నిర్మించి రిజర్వాయర్లకు మళ్లించుకునే అద్భుతమైన అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలో కొన్ని ప్రధాన జంక్షన్ల వద్ద వరద నీటిని సేకరించేందుకు భూగర్భ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించిన పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించవచ్చు. వర్షాకాలంలో వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటిని ఇలాంటి రిజర్వాయర్లు, స్టోరేజ్ ట్యాంకుల్లోకి మళ్లిస్తే భవిష్యత్తులో సాగునీటి కొరత ఉండదు. ప్రాజెక్టుల నిర్మాణం, కాలువల ఆధునీకరణపై సరైన ప్రణాళిక ఉంటే ప్రతి గొంతుకు నీరు అందుతుంది. కేవలం రాజకీయ మైలేజ్ కోసం నిత్యం ఆంధ్రాను దోషిగా చూపడం మానేసి సొంత రాష్ట్రంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా పాలకుల ఆలోచన సాగాలి. వృథాగా పోతున్న వరద నీటిని ఒడిసిపట్టే సమర్థవంతమైన ఇంజనీరింగ్ అడుగులు పడిననాడే రాష్ట్రానికి నిజమైన నీటి భద్రత లభిస్తుంది.

# 16 అడుగులకే గణేశుడి ప్రతిమలు

## పోలీస్ శాఖ వార్నింగ్




**హైదరాబాద్,** : వినాయక నవరాత్రోత్సవాల నేపథ్యంలో గణేశ్ విగ్రహాల తయారీదారులకు సీపీ సజ్జనార్ కీలక సూచనలు జారీ చేశారు. విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు మించకూడదని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని, రవాణా సమయంలో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని.. ఈ సారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సీపీ సజ్జనార్ హితవు పలికారు. త్వరలోనే దేశవ్యాప్తంగా వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే గణేష్ విగ్రహాల తయారీ ముమ్మరంగా జరుగుతోంది. గణేష్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే గణేష్ విగ్రహాల తయారీదారులకు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తాజాగా కీలక ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన హైదరాబాద్ సీపీ.. గణేష్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగుల కంటే ఎక్కువ ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇక ఈ ఏడాది ఖైరతాబాద్ మహా గణపతిని 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో తీర్చిదిద్దనున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ తీవ్ర హెచ్చరికలు చేశారు. గురువారం గణేష్ విగ్రహాల తయారీదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడిన సీపీ సజ్జనార్.. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు గుర్తుచేశారు. వినాయక విగ్రహాల రవాణా సమయంలో జరిగిన 4 ప్రమాదాల నేపథ్యంలో ఈసారి మరింత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. మట్టి గణేష్ విగ్రహాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని.. చిన్న విగ్రహాల ప్రతిష్ఠాపనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ సూచించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, సురక్షిత విద్యుత్ వైరింగ్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు అధికారికంగా ధ్రువీకరించినవే కావాలని పేర్కొన్నారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేకంగా ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ఏర్పాటు చేయాలని తయారీ దారులకు సజ్జనార్ సూచించారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణా చేయవద్దని.. రవాణాకు ముందు ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని చెప్పారు. విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో విగ్రహాల రవాణా చేపట్టాలని సూచించారు.

# రేవంత్ కు గ్రేటర్ కలవరం




**హైదరాబాద్,** : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు. అధికారంలో ఉన్నారన్న మాటే కానీ గ్రేటర్ ఎన్నికలపై కొంత ఆందోళన కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అనేక అంశాలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క శాసనసభ నియోజకవర్గంలోనూ గెలవలేదు. తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో మాత్రం గెలిచి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం లభించినట్లయింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు మాత్రం అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టిందన్న విమర్శలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, కానీ కాంగ్రెస్ హయాంలో కొంత హైదరాబాద్ లో అభివృద్ధి వెనకబడి ఉందని అంటున్నారు. రియల్ ఎస్టేట్ కూడా పెద్దగా ముందుకు పోవడం లేదు. అనేక ఇళ్లు కొనుగోలు చేయకుండా మూలన పడి ఉన్నాయి. ఇదే సమయంలో రహదారులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు మ్యాన్ హోల్స్ లో పడి మృతులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అలాగే మంచినీటి సరఫరా కూడా వేసవిలో సక్రమంగా అందకపోవడంతో నగరవాసులు ఒకింత అసంతృప్తితో ఉన్నారంటున్నారు మరొకవైపు హైడ్రా అంశం కూడా కీలకంగా మారింది. హైడ్రా అధికారులు ఆక్రమణలు కూల్చివేయడంతో అనేక మంది తమ నివాసాలను కోల్పోయారు. హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, అన్యాయంగా కూల్చివేస్తుందని ఆరోపిస్తున్నారు. మరొకవైపు మూసీ రిజర్వాయర్ ప్రక్షాళన పనులు ప్రారంభిస్తామని చెప్పడం, సర్వేలు చేయడం వంటివి కూడా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. దీంతో పాటు హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటం, కాంగ్రెస్ ఏ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను సాధిస్తుందన్న ప్రశ్నలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. బీజేపీ హిందుత్వ నినాదంతో వెళుతుండటం, మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సన్నిహిత్వంపై ప్రశ్నిస్తుండటం కూడా కాంగ్రెస్ ను కొంత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కలవరానికి గురి చేస్తున్నాయని చెప్పక తప్పదు.

# డిఫెన్స్ లో మోడీ....

**న్యూఢిల్లీ, జూలై 31 :** కేంద్రంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల జెన్ జీ ఆందోళనను ఆసరా చేసుకుని రాహుల్ కేంద్రంపై విరుచుకు పడేందుకు ప్రయత్నిస్తున్నారు. మ్యాగ్జిమం ప్రెషర్ వ్యూహాన్ని రెడీ చేసుకున్నారు. జెన్–జీ విద్యార్థుల నిరసనల తీవ్రతకు, ప్రతిపక్షాల వరుస ఆందోళనలకు లొంగి కేంద్రం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించారు. ప్రధాని మోదీ హయాంలో కేంద్రం ఇంతటి తీవ్ర ఆత్మరక్షణ ధోరణిలోకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పరిణామాన్ని తమకు లభించిన అతిపెద్ద విజయంగా భావిస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ద్వయం.. ఇప్పుడు తమ దాడులను నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపైకి మళ్లించారుపార్లమెంట్ లోపల, బయట రాహుల్ గాంధీ తీవ్రమైన ఆరోపణలు గుప్పిస్తూ రాజకీయ వేడిని పెంచారు. విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల చర్యలను ప్రస్తావి విద్యార్థుల శరీరంపైకి పెల్లెట్లు, బుల్లెట్లు వేయించింది అమిత్ షానే అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సభలో మాట్లాడేందుకు పూర్తి అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ బయటకు వచ్చి విలేకరుల సమావేశం పెట్టి, జెన్–జీ తరాన్ని రెచ్చగొట్టేలా నేరుగా హోంమంత్రినే టార్గెట్ చేయడం ప్రతిపక్షం మార్చుకున్న దూకుడు వైఖరికి నిదర్శనం. సభలో ప్రియాంక గాంధీ సైతం ఇదే తరహా దూకుడును ప్రదర్శిస్తుండటంతో.. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఎటాక్ మోడ్‌లోకి వెళ్లగా, అధికార పక్షం కౌంటర్ ఇచ్చుకోవడానికి కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు ప్రధాన్‌ను మార్చేసినట్లుగా ప్రధానిని మార్చేస్తామని కాక్రోచ్ పార్టీ ప్రెసిడెంట్ దీప్కే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రధాని మోదీ ఇన్ ఫ్లూయన్సర్‌గా మారాలని మాట్లాడుతున్నారు. వారి వెనుక ఆమ్ ఆద్మీ వంటి పార్టీలు ఉన్నాయి. ఆ విషయం బహిరంగంగా చెప్పుకోవడం లేదు. బీజేపీకి తెలుసు. కానీ ఇలాంటి వారికి బలం ఇచ్చింది బీజేపీ డిఫెన్సివ్ ధోరణినే. అందుకే భరించక తప్పడం లేదు. దశాబ్దాలుగా ఎలక్షన్ మెషినరీని, పార్లమెంటరీ వ్యూహాలను శాసిస్తున్న బీజేపీ, మోదీ–షా ద్వయం ఈ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు స్వంత శైలిలో కౌంటర్ స్ట్రాటజీని అమలు చేస్తోంది. అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన పెల్లెట్ ప్రయోగం ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, పార్లమెంట్ వేదికగా క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జితేంద్ర సింగ్‌లు సభలో తీవ్రంగా నిలదీశారు. రూల్ బుక్ ఆధారంగా స్పీకర్ చేత ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేలా చేయడంలో సఫలమయ్యారు. డిఫెన్సివ్‌గా కనిపిస్తూనే, మరోవైపు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్ వంటి జాతీయ భద్రతా బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుంటూ.. తాము నేషనల్ సెక్యూరిటీ విషయంలో రాజీపడేదే లేదని, ఓటు బ్యాంక్ రాజకీయాలకు లొంగబోమని తమ శ్రేణులకు సంకేతాలు ఇస్తున్నారు. రాహుల్ గాంధీ విద్యార్థులను, యువతను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ దేశంలో అశాంతిని రేపుతున్నారని, ఆర్ఎస్ఎస్ , విద్యావ్యవస్థపై బురద జల్లుతున్నారని బీజేపీ మీడియా విభాగాలు విస్తృత ప్రచారం మొదలుపెట్టాయి. కానీ ఇవన్నీ అంతగా ప్రజల్లోకి వెళ్లడం లేదు. అత్యధిక సీట్లతో తిరుగులేని బలంతో ఉన్నప్పటికీ.. జెన్ జీ యువత ఆలోచనలు, వీధి పోరాటాలు , రాహుల్ గాంధీ దూకుడు ఈ సరికొత్త సవాలును తిప్పికొట్టడం బీజేపీకి అంత తేలికైన విషయమేమీ కాదు. ప్రభుత్వం బడ్జెట్, బిల్లుల ఆమోదంపై దృష్టి పెట్టినప్పటికీ.. మీడియా, సోషల్ మీడియా నెరేటివ్ యుద్ధంలో రాహుల్ పెంచుతున్న వేడిని బీజేపీ ఎంతవరకు అదుపు చేయగలుగుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది

# కేటీఆర్ హస్తిన పర్యటనల వెనుక...

**హైదరాబాద్,** : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరసగా ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తున్నారు. విపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇటీవల హస్తిన బాట పట్టడం ఒకింత రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది. అధికార పక్షంలో ఉన్న వారు సహజంగా హస్తినకు వెళ్లి కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి చర్చించడం ఎక్కడైనా జరుగుతుంది. కానీ తెలంగాణలో మాత్రం కేటీఆర్ ఇటీవల కాలంలో వరసగా ఢిల్లీకి వెళుతూ కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం హాట్ టాపిక్ గా మారింది. ఒక రకంగా రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఇదొక రకమైన సవాల్ విసురుతున్నట్లే అనుకోవాల్సి ఉంటుంది... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. కొన్నిరోజుల క్రితం కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి ఆదిలాబాద్ లో సీసీఐ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్మాగారాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వతేదీన కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. రెండు వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక



ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడం కూడా చర్చనీయాంశంగా మారింది. తాజాగా మరోసారి ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కేటీఆర్ కలిశారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు, ఐటీ విస్తరణ మరియు జాతీయ రాజకీయ వ్యూహాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపినట్లు వార్తలు వచ్చాయి. ఆర్ ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి సిరిసిల్ల రైల్వే ప్రాజెక్టుతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే పనులపై చర్చించారు. రాష్ట్రంలో కొత్త ఐటీ సంస్థల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన గురించి కేంద్ర పెద్దలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం, జాతీయ స్థాయిలో పార్టీ ఉనికిని చాటడం ఈ పర్యటనల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తుంది. మొత్తం మీద కేటీఆర్ హస్తిన టూర్లు ఇటు అధికార పార్టీలో కాక రేపుతున్నాయి. కేంద్రమంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించడం సరికొత్త రాజకీయ ఎత్తుగడగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రేవంత్ లో ఫైర్ తగ్గుతుందా...

**హైదరాబాద్,** : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ ఆఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణాత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది-తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బిజెపి సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే



అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది. రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమల్లోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తిరిగి తన మార్క్ ఆఫెన్సివ్ డెవలప్‌మెంట్ ఎజెండాతో ముందుకు వస్తారా లేక ఈ పొలిటికల్ అప్రమత్తతలోనే కొనసాగుతారా అనేది వేచి చూడాలి.

# పక్కా వ్యూహాలతో టీపీసీసీ

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ముందస్తు వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు వేడెక్కుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పన్నుతున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం సాగుతున్న పోరులో బీజేపీ అవలంబిస్తున్న తీరును గమనించిన కాంగ్రెస్ నాయకత్వం, దాన్ని క్షేత్రస్థాయిలోనే ఎదుర్కొనేందుకు సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగానే, న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటైన సుమారు నాలుగు నెలల తర్వాత మొదటిసారి జరిగిన ఈ భేటీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వంశీచంద్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఈ ఓట్ల తొలగింపు కుట్రను ఏకగ్రీవంగా తిప్పికొట్టాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సవరణ ప్రక్రియ రాష్ట్రంలో 50 నుండి 60 శాతం మేర పూర్తయిందని, రాబోయే రెండు మూడు రోజుల్లో మొదటి దశ పూర్తిగా ముగియనుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న 36 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. నాఎఖీ ప్రక్రియ ముగిసే వరకు పార్టీ ముఖ్య నేతలు, డిసిసిలు, మండల స్థాయి నాయకులు ఎలాంటి ఇతర



పనులూ పెట్టుకోకుండా పూర్తిస్థాయిలో దీనిపైనే దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో మందకొడిగా వ్యవహరించిన కొందరు పార్టీ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, బీఎల్ఏల తీరుపై సమావేశంలో మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నిర్లక్ష్యం వహించే వారిపై రివ్యూ జరిపి, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం కాంగ్రెస్ కఠిన వైఖరికి నిదర్శనం. పార్టీ యంత్రాంగం-ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం సాధించడం కోసం ప్రతి రెండు నెలలకోసారి పీసీసీ సమన్వయ కమిటీ భేటీ కావాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి -మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జిల్లాల ఇన్చార్జిలు, జిల్లా పీసీసీలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదికల ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. మొత్తానికి, ఓటర్ల జాబితా పరిరక్షణ నుండి ఎన్నికల వ్యూహాల వరకు కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నాయని స్పష్టమవుతోంది.

# నల్గొండలో కోమటి వర్గానిదే పై చేయి...



**నల్గొండ,** : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుల మార్పు అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నల్గొండ డీసీసీ పీఠంపై జరుగుతున్న పోరు అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బట్టబయలు చేస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతను పదవి నుంచి తొలగించాలనే ప్రతిపాదన తీవ్ర దుమారానికి దారితీసింది. కోమటిరెడ్డి సోదరులు మొదటి నుంచి ఈయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకోల్ వివాదం తలెత్తడం, స్థానిక కేడర్ మధ్య విభజన స్పష్టంగా కనిపించడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఒకవైపు అధినేత అండదండలు ఉన్నప్పటికీ, సొంత జిల్లా మంత్రుల ఒత్తిడి కారణంగా ఈ మార్పు వ్యవహారం అత్యంత సున్నితమైన రాజకీయ అంశంగా మారింది. ఈ పరిణామం కేవలం ఒక పదవికి సంబంధించినది కాకుండా, పార్టీలో ఎవరి ఆధిపత్యం చెల్లుబాటు అవుతుందనే దానికి నిదర్శనంగా మారింది. ఒకవేళ పున్నాపై వేటు పడితే, అది సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి ఎదురుదెబ్బగా భావించాల్సి వస్తుంది. కోమటిరెడ్డి బ్రదర్స్ పట్టు నెగ్గితే, అది ప్రత్యర్థి శిబిరానికి స్పష్టమైన రాజకీయ సంకేతాలను పంపుతుంది. ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ, మంత్రివర్గంలో చక్రం తిప్పుతున్న బలమైన మంత్రుల ఒత్తిడిని అధిగమించడం నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ అత్యంత కీలకమైనవే కాబట్టి, ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర స్థాయిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం సామాజిక సమీకరణాలు కావడం గమనార్హం. పున్నా కైలాష్ నేత బీసీ వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు కావడం పార్టీకి ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే కుల గణనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో, బీసీ నేతను పదవి నుంచి తప్పించడం తీవ్ర విమర్శలకు దారితీసే ప్రమాదం ఉంది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటే, ప్రతిపక్షాలకు బలమైన అస్త్రం దొరికినట్లే అవుతుంది. కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. సామాజిక న్యాయం నినాదానికి తూట్లు పడుతున్నాయనే విమర్శలు రాకుండా ఉండేందుకు పార్టీ పెద్దలు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్గపోరు తీవ్ర రూపం దాల్చడం, బీసీ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం పొంచి ఉండటంతో కాంగ్రెస్ హైకమాండ్ తల పట్టుకుంటోంది. ఒకవైపు మంత్రుల పట్టుదల, మరోవైపు ఎన్నికల సమయాన సామాజిక సమీకరణాలు దెబ్బతింటాయనే ఆందోళన పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు పార్టీకి నష్టం చేకూరుస్తాయని అనుభవజ్ఞులైన నేతలు హెచ్చరిస్తున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ అసమ్మతి రాగాలు పెరిగితే అది నష్టాన్ని కలిగిస్తుంది. వివాదాలను సద్దుమణిగిస్తూ, అందరినీ కలుపుకెళ్లే వ్యూహరచన చేయడంలో అధిష్టానం విఫలమైతే, అది ప్రత్యర్థులకు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. ఈ సంక్లిష్ట పరిస్థితిని పార్టీ పెద్దలు ఎలా చక్కదిద్దుతారనేది అత్యంత ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో డీసీసీల మార్పు కత్తిమీద సాములా మారింది. ఒకవైపు సొంత పార్టీ మంత్రుల ఒత్తిడి, మరోవైపు సామాజిక వర్గాల అసంతృప్తి మధ్య అధిష్టానం సతమతమవుతోంది. ఈ వివాదానికి త్వరలోనే తెరపడకపోతే, అది రాబోయే ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించి, ఐక్యతను సాధించడంలో నాయకత్వం సఫలమవుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీ భవిష్యత్తును శాసించేదిగా ఉండనుంది. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

## టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు



**హైదరాబాద్,** : తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# రంగనాథ్ కు మద్దతుగా రేవంత్


**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర రూపురేఖలను మారుస్తామని.. చెరువులు, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా ను తెరపైకి తెచ్చింది. అయితే ఇప్పుడిది రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హైడ్రాను సీఎం రేవంత్ రెడ్డి తన 'బ్రెయిన్ చైల్డ్'గా భావిస్తుంటారు. అందుకే హైడ్రా కమిషనర్‌గా సమర్థుడిగా పేరొందిన ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించి, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అయితే, ఇటీవల హైకోర్టు రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించడంతో ఈ ఉదంతం ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడినట్లే కనిపించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ అంశంలో అంగుళం కూడా వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా రంగనాథ్‌నే అదే పదవిలో కొనసాగించాలనే దిశగా కాంగ్రెస్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. అధికారుల నియామకం, బదిలీలు అనేది సంపూర్ణంగా ప్రభుత్వం పరిధిలోని అంశమని, ఇందులో కోర్టు జోక్యం సరికాదనే బలమైన వాదనను వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ నిపుణులతో వరుస సమావేశాలు నిర్వహించి లీగల్ ఆప్షన్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి రాగానే దీనిపై తుది సమీక్ష నిర్వహించి, హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. కోర్టు ఆదేశాలపై స్టే తెచ్చుకోవడమే కాకుండా, రంగనాథ్ బాధ్యతలను యథాతథంగా కొనసాగించేలా న్యాయపోరాటం చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. రాజకీయ కోణంలో చూస్తే, హైడ్రా అనేది కేవలం ఒక ప్రభుత్వ విభాగానికో లేదా ఆక్రమణల తొలగింపుకో పరిమితమైన అంశం కాదు. ఇది రేవంత్ రెడ్డి పొలిటికల్ ఇమేజ్‌తో నేరుగా ముడిపడి ఉంది.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి అత్యంత ఆవేశంగా, పట్టుదలతో ముందుకు తీసుకెళ్లిన ప్రాజెక్ట్ హైడ్రా. ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల కారణంగా వెనకడుగు వేస్తే, అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు పెద్ద ఆయుధంగా మారుతుంది. అధికారుల నియామకంలో కోర్టుల ఆదేశాలకు తలొగ్గితే, భవిష్యత్తులో పరిపాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రా లక్ష్యాలను నిర్భయంగా అమలు చేయడంలో రంగనాథ్ చూపిన చొరవ రేవంత్‌కు బాగా నచ్చింది. ఆయనను తొలగిస్తే పథకం వేగం మందగిస్తుందనేది సర్కార్ భయం. న్యాయస్థానాలు కోర్టు ఉత్తర్వులను గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతుంటే, ప్రభుత్వం మాత్రం తమ పరిపాలనాధికారాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు చట్టబద్ధత, కోర్టు ధిక్కరణ ఆరోపణలు, మరోవైపు రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పట్టుదల.. ఈ రెండింటి నడుమ హైడ్రా వ్యవహారం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం వినిపించే వాదనలు ఎంతవరకు నిలబడతాయి? కోర్టు రంగనాథ్ నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, రేవంత్ రెడ్డి తీసుకోబోయే తుది నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లోనూ, అధికారుల నియామక ప్రక్రియల్లోనూ ఒక కొత్త చర్చకు దారితీయడం ఖాయం

# లోకల్ ఎన్నికలపై విజయ్ బ్యాక్ స్టెప్

**చెన్నై,** : తమిళనాడు రాజకీయ వేదికపై విప్లవాత్మక మార్పులతో అధికారాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్, ప్రతిపక్షాలకు చిక్కని కొత్త వ్యూహానికి తెరలేపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరలోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారంలోకి వచ్చాయి. పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇప్పుడే ఎన్నికలకు వెళ్తే పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే అంచనాలతో ఎన్నికలను కనీసం ఒక ఏడాది పాటు వాయిదా వేయాలని సీఎం విజయ్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యూహాత్మక వెనుకంజ వెనుక ఉన్న అసలు కారణం.. టీవీకేకి క్షేత్రస్థాయిలో ఉన్న బలహీనమైన సంస్థాగత నిర్మాణమే . అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్టార్ పవర్, యువత ఓట్లు , కొత్త మార్పును కోరుకున్న ఓటర్ల మద్దతుతో టీవీకే ఘనవిజయం సాధించినప్పటికీ, గ్రామ స్థాయిలో క్రియాశీలక నాయకత్వం, బూత్ స్థాయి నెట్‌వర్క్ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం అధినేత ఇమేజ్, రాష్ట్రస్థాయి అంశాలు సరిపోతాయి కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా క్షేత్రస్థాయి వ్యక్తిగత పరిచయాలు, బలమైన కార్యకర్తల జాలంపైనే ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో స్థానిక పోరుకు వెళ్తే గ్రామీణ స్థాయిలో ఉన్న క్యాడర్ లోపం బయటపడే అవకాశం ఉంది. మరోవైపు, పరాజయం పాలైనప్పటికీ ఇప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గ్రామీణ స్థాయిలో బలమైన స్థానిక బూత్ కమిటీలు కలిగిన ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే, తమకున్న కేడర్ బలంతో డీఎంకే క్షేత్రస్థాయిలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ ప్రతిపక్ష డీఎంకే గనుక స్థానిక పోరులో పైచేయి



సాధిస్తే, టీవీకే గెలుపు కేవలం తాత్కాలిక వేవ్ లేదా హైప్ మాత్రమే.. క్షేత్రస్థాయిలో వాళ్లకు ఎలాంటి పునాది లేదు అని విస్తృతంగా ప్రచారం చేసి విజయ్ ప్రభుత్వ ఇమేజ్‌ను మొదటికే మోసం చేసేలా కౌంటర్ ఇచ్చే ప్రమాదం ఉందని అధికార పక్షం భావిస్తోంది. ఈ ముప్పును ముందుగానే గ్రహించిన సీఎం విజయ్, ముందుగా రాబోయే అసెంబ్లీ ఉపఎన్నికలపై దృష్టి సారించి, స్థానిక సంస్థల పోరును ఏడాది పాటు పక్కన పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ లోపు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డులో టీవీకే కమిటీలను పటిష్టం చేసి, కొత్త రక్తాన్ని నింపి, శ్రేణులకు దిశానిర్దేశం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిల్లో డీఎంకేను ఢీకొట్టేలా వ్యవస్థను నిర్మించుకున్న తర్వాతే బరిలోకి దిగడం సురక్షితమని, ఆలోపు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల్లో మరింత ఆదరణ పెంచుకోవాలని టీవీకే నాయకత్వం భావిస్తోంది. ఎన్నికలను వాయిదా వేసే యోచన వెనుక భయం కంటే రాజకీయ చాతుర్యమే ఎక్కువగా కనిపిస్తోందని అంటున్నారు. ప్రత్యర్థుల బలమైన ప్రాంతంలో తొందరపడి అడుగుపెట్టి దెబ్బతినడం కంటే, సమయం తీసుకుని సొంత సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాకే యుద్ధానికి వెళ్లడం విజయ్ రాజకీయ పరిణతికి నిదర్శనంగా మారింది.

# బంగారం నిల్వలపై ప్రభుత్వం కొత్త ప్లాన్...



భారత ప్రభుత్వం గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్)ను పునరుద్ధరించి కొత్త రూపంలో తీసుకురావడానికి సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి రాబోయే రెండు వారాల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రతిపాదిత మార్పుల ప్రకారం, ఇప్పటివరకు కేవలం బ్యాంకులకు మాత్రమే ఉన్న బంగారం సేకరణ పాత్రను ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న జ్యువెలర్లకు కూడా విస్తరించనున్నారు. వీరిని 'సేకరణ భాగస్వాములు(కలెక్షన్ పార్ట్నర్ )'గా చేర్చి ఇళ్లలో నిల్వగా ఉన్న బంగారాన్ని సమీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ మార్గంలో సుమారు 1,000 టన్నులకుపైగా బంగారం సమీకరించవచ్చని అంచనాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఇళ్లలో దాదాపు 25,000 టన్నుల బంగారం ఉండగా, కేవలం 5 శాతం నగదీకరణ చేసినా దాదాపు 80?90 బిలియన్ డాలర్లు(రూ. 7.6–8.57 లక్షల కోట్లు) లిక్విడిటీ అందుబాటులోకి వస్తుందని పరిశ్రమ వర్గాల అంచనాలు చెబుతున్నాయి.

దీనికి సంబంధించి రాబోయే రెండు వారాల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రతిపాదిత మార్పుల ప్రకారం, ఇప్పటివరకు కేవలం బ్యాంకులకు మాత్రమే ఉన్న బంగారం సేకరణ పాత్రను ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న జ్యువెలర్లకు కూడా విస్తరించనున్నారు. వీరిని 'సేకరణ భాగస్వాములు(కలెక్షన్ పార్ట్నర్ )'గా చేర్చి ఇళ్లలో నిల్వగా ఉన్న బంగారాన్ని సమీకరించాలన్నది ప్రభుత్వ లక్ష్యంఈ ప్రయత్నం వెనుక 2015లో ప్రారంభమైన పాత జీఎంఎస్ పథకమే ప్రధాన కారణం. ఆ పథకం కింద ఇప్పటివరకు కేవలం 38 టన్నుల బంగారం మాత్రమే సమీకరించారు. బ్యాంకులకు తక్కువ వ్యాపార ప్రోత్సాహం, పన్ను భయాలు, ప్రజల్లో బంగారంపై ఉన్న భావోద్వేగ విలువలు వంటి కారణాలతో స్కీమ్ పెద్దగా విజయవంతం కాలేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కొత్త ఫ్రేమ్వర్క్ ద్వారా ఉపయోగంలో లేని బంగారాన్ని ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, కరెంట్ అకౌంట్ ఒత్తిడిని తగ్గించడం లక్ష్యంగా ఉంది. సైద్ధాంతికంగా చూస్తే, పెద్ద స్థాయిలో బంగారం సమీకరణ జరిగితే దిగుమతులపై డిమాండ్ తగ్గి రూపాయి స్థిరత్వానికి కూడా మద్దతు ఇవ్వగలదని నిపుణులు భావిస్తున్నారు.


## జపనీస్ గ్రీన్‌టీ పొడి దేశీయంగా తయారీ



ఖరీదైన జపనీస్ గ్రీన్ టీ పొడి 'మాచా' ను, దేశీయంగా తొలిసారి వాణిజ్య పద్ధతిలో ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించింది అస్సాంలోని ,ఓటా టింగ్రాయ్ టీ ఎస్టేట్. ఆకు నుంచి తయారు చేసే, పోషకాలు అధికంగా కలిగి ఉండే టీ పొడి ఇది. యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు కలిగి, జీవక్రియను పెంచే సమ్మేళనాలను ఇది అందిస్తుందని చెబుతారు. సాధారణ గ్రీన్ టీ కంటే మాచాలో 3 రెట్లు ఎక్కువగా కాటెచిన్లు ఉంటాయని, ఒత్తిడి నివారణకు ఇది ఉపయోగ పడుతుందని సమాచారం. ఆరోగ్యకర ఆహారంతో కలిపి క్రమం తప్పకుండా తీసుకుంటే, కొవ్వు కరుగుతుందని సమాచారం.

గువాహటి టీ వేలంలో ఈ పొడికి కిలో రూ. 3,000 పలికిందని అస్సాం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ వెల్లడించారు. జపాన్ టీ తయారీదారులు, అక్కడి పరికరాల సరఫరాదార్ల వల్లే ఇది సాధ్యమైందన్నారు. జపాన్, చైనా, వియత్నాంలలో మాత్రమే ఉత్పత్తి అవుతున్న ఈ టీపొడికి అంతర్జాతీయంగా గిరాకీ ఉన్నా, సరఫరా తక్కువ.

## ఈపీఎఫ్ ఖాతాల్లో రూ.9,300 కోట్లకుపైగా అన్‌క్లెయిమ్డ్ నిధులు




కేంద్ర ప్రభుత్వం సరికొత్త 'ఈపీఎఫ్ స్కీమ్– 2026'ని అమలులోకి తెచ్చి ప్రావిడెంట్ ఫండ్ నిబంధనలను డిజిటలైజ్ చేసినప్పటికీ, క్లెయిమ్ కాని పీఎఫ్ సొమ్ము సమస్య మాత్రం దేశాన్ని ఇంకా వేధిస్తూనే ఉంది. 'ఇండియా టుడే' సేకరించిన ప్రత్యేక ఆర్టీఐ నివేదిక ప్రకారం, ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా సుమారు 30.91 లక్షల ఇన్‌యాక్టివ్ ఈపీఎఫ్ ఖాతాలు ఉన్నాయి. చందాదారులు ఎలాంటి లావాదేవీలు జరపకుండా వదిలేసిన ఈ అకౌంట్లలో ఏకంగా రూ. 9,330 కోట్లకు పైగా నిధులు మూలనపడి ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో (మార్చి 2025 నాటి రూ. 10,181 కోట్లు) పోలిస్తే ఈ ఇన్‌యాక్టివ్ ఖాతాల సంఖ్య 92,000, నిలిచిపోయిన సొమ్ము రూ. 851 కోట్లు తగ్గినప్పటికీ.. దాదాపు 31 లక్షల అకౌంట్లలో వేల కోట్ల రూపాయల కార్మికుల పదవీ విరమణ పొదుపు నిధులు ఇంకా క్లెయిమ్ కాకుండా పడి ఉండటం గమనార్హం. ఈ నిధుల పరిమాణం ఎంత పెద్దదో అర్థం కావడానికి ప్రభుత్వ వ్యయాలతో పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడవుతాయి. ఈ సొమ్ము, కేంద్ర ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక ప్రాంతీయ విమానయాన పథకం 'ఉడాన్' కోసం 2016 నుంచి ఇప్పటివరకు ఖర్చు చేసిన మొత్తం నిధులతో (రూ. 10,169 కోట్లు) దాదాపు సమానం. అలాగే, ప్రస్తుత 2026–27 ఆర్థిక సంవత్సరానికి 'ఆయుష్మాన్ భారత్' ఉచిత వైద్య బీమా పథకం కోసం ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌కు కూడా ఇది ఇంచుమించు సరిపోతుంది. ప్రస్తుత ద్రవ్యోల్బణ లెక్కల ప్రకారం ఒక కొత్త ఐఐటీని నిర్మించడానికి సుమారు రూ. 2,934 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే.. పీఎఫ్ ఖాతాల్లో పడి ఉన్న ఈ సొమ్ముతో ఏకంగా మూడు ఐఐటీలను నిర్మించి, ఇంకా రూ. 500 కోట్లకు పైగా మిగుల్చుకోవచ్చు. అయితే ఈ నిష్క్రియ ఖాతాల వెనుక ఉన్న పూర్తి వివరాలను వెల్లడించడానికి ఈపీఎఫ్ఓ నిరాకరించింది. గత ఐదేళ్ల ట్రెండ్ ఎలా ఉందో చెప్పాలని కోరగా, 2025–26లోనే ప్రత్యేకంగా 'ఇనాపరేటివ్ అకౌంట్స్ సెల్' (ఐఏఎస్)ను ఏర్పాటు చేశామని, అందుకే గత రెండేళ్ల డేటా మాత్రమే ఉందంటూ పాత లెక్కలను దాటవేసింది. పైగా, రూ. 5 లక్షల కంటే ఎక్కువ నిల్వలున్న పెద్ద అకౌంట్ల వివరాలు తమ వద్ద విడిగా లేవని పేర్కొంది. ఇక ఏ అకౌంట్లు ఆధార్‌తో లింక్ అయ్యాయి, వేటికి ఆటో–సెటిల్‌మెంట్ సాధ్యమవుతుంది అనే కీలకమైన సమాచారాన్ని 'విశ్వసనీయ సంబంధాల మినహాయింపు' క్లాజ్ ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఇ) కింద చెప్పడానికి నిరాకరించింది. దీంతో డిజిటల్ సంస్కరణలు వేగంగా అమలవుతున్నప్పటికీ, కార్మికులు ఉద్యోగాలు మారిన తర్వాత లేదా ఉద్యోగ జీవితం ముగిసిన తర్వాత తమ ఈపీఎఫ్ పొదుపులను క్లెయిమ్ చేసుకునే విషయంలో ఇంకా అవగాహన, ట్రాకింగ్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందనే విషయం స్పష్టమవుతోందని నిపుణులు భావిస్తున్నారు.

## ఒకే రక్త నమూనాతో క్యాన్సర్ గుర్తింపు




క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా రోగుల ప్రాణాలు కాపాడేందుకు దేశీయ వైద్య రంగంలో సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. అపోలో క్యాన్సర్ సెంటర్ (ఏసీసీ), జైడస్ లైఫ్‌సైన్సెస్ మధ్య ఇందుకోసం ఒక కీలక ఒప్పందం కుదిరింది. అమెరికా ఆంకాలజీ కంపెనీ గార్డెంట్ హెల్త్ అభివృద్ధి చేసిన అత్యాధునిక 'షీల్డ్ మల్టీ–క్యాన్సర్ డిటెక్షన్ (ఎమ్‌సీడీ) రక్త పరీక్షను వీరు మనదేశంలో ప్రవేశపెట్టారు. ఈ అత్యాధునిక పరీక్షను దేశీయంగా అందుబాటులోకి తెచ్చిన సంస్థగా అపోలో నిలిచింది. మానవ శరీరంలోని మిథైలేషన్ ప్రక్రియ ఆధారంగా ఇది పనిచేస్తుంది. 45 ఏళ్లు – అంతకంటే ఎక్కువ వయస్సుండి, సాధారణ క్యాన్సర్ ముప్పు ఉన్న వ్యక్తుల్లో రొమ్ము, ఊపిరితిత్తులు, కాలేయం, పెద్దపేగు, ప్రొస్టేట్, అన్నాశయం, ఆహారవాహిక, అండాశయం, పాంక్రియాటిక్, మూత్రాశయం వంటి వివిధ రకాల క్యాన్సర్లను గుర్తించేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. వ్యాధుల ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలపైనే ఆరోగ్య సంరక్షణ ఆధారపడి ఉంటుందని, తక్కువ క్యాన్సర్ స్క్రీనింగ్ రేట్లు ఉన్న మన దేశంలో ఈ అత్యాధునిక పరీక్ష ద్వారా ప్రజల్లో 'ప్రాణాంతక వ్యాధి' నివారణపై అవగాహన పెరుగుతుందని అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతా రెడ్డి అన్నారు.

## కోటక్ బ్యాంక్ చేతికి డాయిష్ రిటైయిల్‌ప్రైవేటు బ్యాంకింగ్ వ్యాపారాలు...




జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్‌కు మన దేశంలో ఉన్న రిటెయిల్, ప్రైవేటు బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాలను కొనుగోలు చేయడానికి ఒక కచ్చితమైన ఒప్పందంపై సంతకం చేసినట్లు ప్రైవేటు రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. ఎంత మొత్తానికి ఈ వ్యాపారాలను కొనుగోలు చేస్తున్నదీ వెల్లడించలేదు. ఈ ఒప్పందంతో సంపన్న, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారానికి మరింత మద్దతునివ్వాలని ఆశిస్తున్నట్లు తెలిపింది. కొనుగోలు చేయబోయే వ్యాపారాల్లో సుమారు రూ. 29,000 కోట్ల రుణాలు, రూ. 16,000 కోట్ల డిపాజిట్లు, రూ. 10,500 కోట్ల నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. భారతదేశంలో తమ రిటెయిల్ వ్యాపారం నుంచి పాక్షికంగా వైదొలగిన అనేక ఇతర అంతర్జాతీయ బ్యాంక్‌ల సరసన డాయిష్ బ్యాంక్ కూడా చేరింది.

## బ్యాట్ బీఎంఎస్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు




బ్యాటరీతో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలను రిమోట్ ద్వారా నిలిపివేస్తున్నాయనే ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మూడు చైనీస్ మొబైల్ యాప్‌లపై కఠిన చర్యలు తీసుకుంది. బ్యాట్–బీఎంఎస్, లాసిజీ, ఎపోచ్–ఐ–అయాన్ యాప్‌లను యాప్ స్టోర్ల నుంచి తొలగించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలలో (ముఖ్యంగా ఈ–రిక్షాలలో) బ్యాటరీ పనితీరును పర్యవేక్షించడానికి 'బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (బీఎంఎస్) అనే ఇంటర్నెట్ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను వాడుతున్నారు. అయితే, ఈ వాహనాల్లో ఉపయోగించే బ్యాటరీల నిర్వహణకు సంబంధించిన కొన్ని చైనీస్ స్మార్ట్‌ఫోన్ యాప్‌ల ద్వారా, దేశంలోని ఈ–రిక్షాలను 'రిమోట్ కంట్రోల్' ద్వారా పూర్తిగా లాక్ చేయవచ్చని, వాటిని పని చేయకుండా నిలిపివేయవచ్చని కొన్ని వీడియోలు ఇంటర్నెట్‌లో సర్క్యులేట్ అవుతున్నాయి. ఈ తీవ్రమైన దేశ భద్రతా సమస్యపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం, శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది.

దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈవీ రంగాన్ని టార్గెట్ చేస్తూ సాగుతున్న ఇటువంటి సైబర్ భద్రతా లోపాలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన సైబర్ భద్రతా సదస్సులో కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ మాట్లాడుతూ.. యాప్ స్టోర్లు ఇష్టానుసారంగా కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. వినియోగదారుల భద్రతకు, దేశ సార్వభౌమత్వానికి హాని కలిగించే ఎలాంటి యాప్‌లైనా సరే అందుబాటులో లేకుండా చూడటంపై యాప్ స్టోర్ల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చిస్తోందని ఆయన వెల్లడించారు.

ఇలాంటి యాప్‌లను ఉపయోగించి ఇతరుల వాహనాలను రిమోట్ ద్వారా నిలిపివేయడం ఐటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని, అలా హ్యాకింగ్‌కు పాల్పడితే మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ. 5 లక్షల వరకు జరిమానా విధిస్తామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ–రిక్షాల భద్రతను పణంగా పెడుతూ సోషల్ మీడియాలో 'ప్రాంక్ వీడియోల' కోసం వాహనాలను లాక్ చేస్తున్న వారిని అడ్డుకట్ట వేసేందుకే కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

## జెట్ ఇంధన ధరలు తగ్గడంతో ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం




ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, జెట్ ఇంధన ధరలు తగ్గడంతో ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు వెళ్లే విమానాలపై విధిస్తున్న ఫ్యూయల్ సర్‌చార్జీలను తగ్గించింది. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రేట్ల ప్రకారం ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా రూట్లలో టికెట్‌కు 280 డాలర్లుగా ఉన్న సర్‌చార్జీని 200 డాలర్లకు తగ్గించగా, యూరప్, యూకే రూట్లలో 205 డాలర్ల నుంచి 125 డాలర్లకు తగ్గించింది.

అయితే ఈ మార్పు ఇతర అంతర్జాతీయ లేదా దేశీయ విమానాలకు వర్తించదని తెలుస్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో జెట్ ఇంధన ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఎయిర్ ఇండియా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫ్యూయల్ సర్‌చార్జీలను ప్రవేశపెట్టింది. ఆ సమయంలో పెరిగిన ఇంధన వ్యయం, గగనతల పరిమితుల కారణంగా విమానాల నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. అయితే ఇటీవల చమురు ధరలు తగ్గడం, కొంత ఉపశమనం లభించడంతో ఈ సర్‌చార్జీలను తగ్గించినట్లు వెల్లడించింది.

# తక్షణ శక్తినిచ్చే ఈ డ్రింక్ ఒక్కసారి ట్రై చేయండి



మనలో ఎంతో మంది విపరీత వేడితో ఇబ్బంది పడతారు. దీనిని క్షణాల్లో తగ్గించుకోవాలంటే ఈ డ్రింక్ తాగితే సరిపోతుంది. ఇది తాగితే, హెల్తీగా ఉంటారు. సత్తు పిండి డ్రింక్ రెసిపీకి కావలసిన పదార్థాలు: నాలుగు టేబుల్ స్పూన్స్ సత్తు పిండి, రెండు గ్లాస్ లు చల్లటి నీరు, రెండు టేబుల్ స్పూన్స్ బెల్లం పొడి, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర పొడి, పావు టేబుల్ స్పూన్ యాలకుల పొడి, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, రుచికి సరిపడా చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్ క్యూబ్స్ ,తరిగి పెట్టుకున్న పుదీనా ఆకులను తీసుకోవాలి. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 1 : ఒక గిన్నెలో సత్తు పిండిని తీసుకుని, దానిలో కొద్దిగా నీరు పోసి ఉండలు లేకుండా దీనిని మంచిగా కలుపుకోవాలి. ఆ తర్వాత దీనిలో కొద్దిగా చల్లటి నీటిని పోస్తూ మిక్స్ చెయ్యాలి. ఇంకా దీనిలో కొద్దిగా ఇప్పుడు బెల్లం కూడా పొడి వేసి మొత్తం కరిగేపోయే వరకు కలపాలి. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 2 : ఒక టేబుల్ స్పూన్ యాలకుల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ఒకటికి రెండు సార్లు బాగా కలపాలి. ఇంకా దీనిలో మీరు కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం కూడా వేసి ఈ టెస్ట్ ను ఎక్కువ పెంచుకోవచ్చు. ఇంకా దీనిలో నాలుగు పుదీనా ఆకులు కూడా వేసి కలిపితే ఫ్రెష్ గా ఉంటుంది. సత్తు పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 3 : ఇంకా ఈ గ్లాస్‌లో నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి సత్తు పిండి డ్రింక్ పోయాలి. దీని పైన అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి చల్లితే రుచి అద్భుతం అని చెప్పాలి. ఇంకా ఇలా తయారు చేసుకున్న తరవాత దీనిని చల్లగా తాగితే అబ్బబ్బా సూపర్ అంటూ తాగుతారు. మీరు దీనిని ఉదయం పూట టిఫిన్ తో పాటు దీనిని తీసుకోవచ్చు ఇంకా  స్నాక్ టైమ్‌లో కూడా తాగొచ్చు.

## జాగ్రత్తగా ట్యాబ్లెట్లను బటానీల్లా తినేస్తున్నారా...?



తలనొప్పి, జ్వరం, ఎసిడిటీ వంటి సాధారణ సమస్యలకు డాక్టర్ సలహా లేకుండా మందులు వాడటం ఆరోగ్యానికి ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వీయ వైద్యం వల్ల లక్షణాలు తాత్కాలికంగా తగ్గినా, అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం జరిగి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. తలనొప్పి, జ్వరం, ఎసిడిటీ, ఒళ్లు నొప్పులు వంటి సాధారణ సమస్యలు వచ్చినప్పుడు చాలా మంది వైద్యుడిని సంప్రదించకుండా స్వయంగా మందులు కొనుగోలు చేసి వాడుతుంటారు. ఈ అలవాటు తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, దీర్ఘకాలంలో ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా స్వీయ వైద్యం వల్ల అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం కావడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రతి మందు ఒక నిర్దిష్ట వ్యాధి లేదా పరిస్థితికి అనుగుణంగా వైద్యులు సూచిస్తారు. వ్యాధి కారణాన్ని తెలుసుకోకుండా అదే మందును పదేపదే వాడటం వల్ల లక్షణాలు కొంతవరకు తగ్గినా, అసలు సమస్య మాత్రం అలాగే కొనసాగవచ్చు. ఫలితంగా వ్యాధి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉ ంటుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఆలస్యంగా గుర్తించబడే అవకాశమూ ఉంది. ఇప్పటికే ఇతర అనారోగ్యాలకు మందులు వాడుతున్న వ్యక్తులు వైద్యుల సలహా లేకుండా కొత్త మందులు తీసుకుంటే ఔషధాల మధ్య పరస్పర చర్యలు జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల అలర్జీలు, కాలేయం లేదా మూత్రపిండాలపై ప్రభావం, ఇతర అనుకోని దుష్ప్రభావాలు తలెత్తవచ్చు. అందుకే వైద్యుడిని సంప్రదించే సమయంలో ప్రస్తుతం వాడుతున్న అన్ని మందులు, విటమిన్లు, ఆయుర్వేద లేదా మూలికా ఉత్పత్తుల వివరాలను తెలియజేయడం అవసరం. జలుబు, దగ్గు వంటి సాధారణ సమస్యలకు కూడా చాలామంది యాంటీబయాటిక్స్‌ను స్వయంగా వాడుతుంటారు. అయితే అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం లేదా వైద్యుడు సూచించిన పూర్తి కోర్సును పూర్తి చేయకపోవడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ఏర్పడుతుంది. దీంతో భవిష్యత్తులో వచ్చే ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడం కష్టతరమవుతుంది. చిన్నపాటి అసౌకర్యాలకు వెంటనే మందులపై ఆధారపడకుండా ముందుగా విశ్రాంతి, సరైన ఆహారం, తగినంత నీరు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలి. అయితే సమస్య పదేపదే వస్తుంటే, తీవ్రంగా ఉంటే లేదా కొన్ని రోజులైనా తగ్గకపోతే తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

# ఈ సాల్ట్ ఎంత ప్రమాదమో తెలుసా..?



నేటి ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ తినడం ఒక అలవాటుగా మారిపోయింది. నూడుల్స్, ఫ్రైడ్ రైస్, సూప్స్, మంచూరియా వంటి చైనీస్ వంటకాలకు ఆ ప్రత్యేకమైన కరకరలాడే రుచిని, మంచి సువాసనను అందించడానికి ఒక ప్రత్యేకమైన సాల్ట్‌ను ఉపయోగిస్తారు.

దానినే మనం అజినోమోటో లేదా చైనా ఉప్పు అంటాం. సైంటిఫిక్ భాషలో దీనిని మోనోసోడియం గ్లూటామేట్ (ఓూఉ) అంటారు. అయితే, అజినోమోటో తింటే హార్ట్ ఎటాక్ వస్తుందని, బీపీ పెరుగుతుందని, మెదడు పాడవుతుందనే ప్రచారాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. నాడీ వ్యవస్థ, మెదడుపై ప్రభావం: చైనీస్ వంటకాల్లో వాడే అజినోమోటో మానవ నాడీ వ్యవస్థను (ఔవతీలనీబీబ ూఎబబివఎ) తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇందులోని గ్లుటామిక్ యాసిడ్ మెదడులో సమాచారాన్ని చేరవేసే న్యూరోట్రాన్స్‌మిటర్‌గా పనిచేస్తుంది. మనం తింటున్న ఆహారం ద్వారా ఈ యాసిడ్ శరీరంలో విపరీతంగా ఎక్కువైతే, అది మెదడు పనితీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విపరీతమైన ఆకలి, ఊబకాయం: అజినోమోటోకు ఒక ప్రత్యేకమైన గుణం ఉంది. ఇది నాలుకపై ఉండే రుచి గ్రంథులను ఉత్తేజపరచడమే కాకుండా, మన ఆకలిని విపరీతంగా పెంచుతుంది. దీనివల్ల కడుపు నిండినప్పటికీ మళ్లీ మళ్లీ తినాలనే కోరిక కలుగుతుంది. ఇలా పదే పదే జంక్ ఫుడ్స్ తినడం వల్ల శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి, వేగంగా బరువు పెరగడం, ఊబకాయం (ూఎవబతిబిఎ) వంటి సమస్యలు వస్తాయి.

## రక్తహీనతను దూరం చేసే సాంప్రదాయ వంటకం



పాతకాలం నాటి తెలంగాణా సాంప్రదాయ ఈ వంటకం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తియ్యటి వంటకం మీరు తింటే మళ్ళీ మళ్ళీ తింటారు. అలాగే రక్తహీనతను దూరం చేస్తుంది. మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మీరు ఈ తీపి వంటకం తింటే, ఆరోగ్యంగా ఉంటారు. పాతకాలం నాటి తెలంగాణా సాంప్రదాయ ఈ వంటకం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తియ్యటి వంటకం మీరు తింటే మళ్ళీ మళ్ళీ తింటారు. అలాగే రక్తహీనతను దూరం చేస్తుంది. మీరు కూడా మీ ఇంట్లో తప్పక ట్రై చేయండి. మీరు ఈ తీపి వంటకం తింటే, ఆరోగ్యంగా ఉ ంటారు. తెలంగాణ సాంప్రదాయ వంటకం బెల్లం పాశానికి కావలసిన పదార్థాలు : రెండు కప్పుల బియ్యం, కప్పున్నర బెల్లం తురుము , ఒక కప్పుల పాలను తీసుకోవాలి, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి, ఒక టీ స్పూన్ యాలకుల పొడి, 5 జీడిపప్పు, 5 కిస్మిస్ లు రెడీ చేసి పెట్టుకోవాలి. మీ వీటిని వేరు వేరుగా తీసుకోవాలి. దీని కోసం ఎక్కువ టైం పెట్టాల్సిన అవసరం లేదు కొద్దీ నిముషాల్లోనే అవుతుంది. ముందుగా బియ్యాన్ని బాగా ఉడికించాలి : ముందుగా రెండు కప్పుల బియ్యాన్ని తీసుకుని నీటితో కడిగి బాగా ఉడికించాలి. అయితే, మరి మెత్తగా కాకుండా వీటిని బాగా ఉడికించుకోవాలి.


# డీప్ ఫేక్ ఫొటోలు వైరల్.. హైకోర్టును ఆశ్రయించిన ప్రీతి జింతా



బాలీవుడ్ సీనియర్ నటి ప్రీతి జింతా తాజాగా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తన ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి అసభ్యకర కంటెంట్‌కు సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని ఆమె ఆరోపించింది. వెంటనే ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు జారీ చెయ్యాలని ప్రీతి జింతా కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ఈ మేరకు ప్రీజి జింతా తరఫు సీనియర్ అడ్వకేట్ వెంకటేష్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్స్ పెరుగుతోందని, అందువల్ల తక్షణమే సదరు లింకులను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. 'వివాదాస్పద లింకులను తొలగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే సాధారణ కంటెంట్‌కు ఇబ్బంది లేకుండా, కేవలం అభ్యంతరకర లింకులను మాత్రమే తొలగించేలా ఒక ప్రాక్టికల్ ప్రోటోకాల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.

## ఒక్క ఇన్‌స్టా పోస్ట్‌కే అన్ని లక్షలా!.....



ఒకప్పుడు హీరో హీరోయిన్ల సంపాదన అంటే సినిమాల రెమ్యూనరేషన్, బ్రాండ్ ప్రకటనలు మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న సెలబ్రిటీలు ఇప్పుడు తమ డిజిటల్ ప్రభావాన్ని కోట్ల రూపాయల ఆదాయంగా మార్చుకుంటున్నారు. ఈ కొత్త ట్రెండ్‌లో అగ్రస్థానంలో నిలుస్తున్న వారిలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఒకరు. శ్రీదేవి వారసురాలిగా వెండితెరకు పరిచయమైన ఆమె, ఇప్పుడు సినిమాలతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా భారీ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. జాన్వీ కపూర్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.68 కోట్లకు పైగా ఫాలోవర్లు ఉ న్నారు. ఎక్స్ వంటి ఇతర సోషల్ మీడియా వేదికల్లో కూడా ఆమెకు విశేష ఆదరణ ఉంది. ఈ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను, ఒక బిజినెస్ గా మలచుకోవడంలో ఆమె సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం దేశీయ, అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లు తమ ఉత్పత్తుల బ్రాండ్ అంబాసిడర్ గా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీంతో ఆమె సోషల్ మీడియా అకౌంట్లు ప్రముఖ కంపెనీలకు అత్యంత విలువైన డిజిటల్ ప్రమోషన్ వేదికలుగా మారాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చేసే ఒక్క ప్రమోషనల్ పోస్ట్ కోసం సుమారు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే ఎక్స్ వేదికపై చేసే ఒక్కో బ్రాండెడ్ పోస్టుకూ లక్షల్లోనే చార్జ్ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. కేవలం పోస్టులు మాత్రమే కాకుండా, ప్రముఖ బ్రాండ్లతో ఒప్పందాలు కూడా ఆమె ఆదాయాన్ని మరింత పెంచుతున్నాయి. ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి ప్రముఖ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఆమె, ఈ ఒప్పందాల ద్వారా ఏడాదికి కోట్లల్లోనే సంపాదిస్తున్నట్లు సినీ, మార్కెటింగ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రతి నెల లైఫ్ స్టైల్, బ్యూటీ, ఫ్యాషన్, గ్యాడ్జెట్స్, టెక్నాలజీ ఉత్పత్తులకు సంబంధించిన అనేక బ్రాండ్ ప్రమోషన్లు ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో కనిపిస్తుంటాయి.

## తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయి విజువల్స్



తెలుగు సినిమా సాంకేతికంగా రోజురోజుకూ మరింత విస్తృతం చేసుకుంటోంది. ఆ మార్పులో నిశ్శబ్దంగా తన ముద్ర వేస్తున్న ప్రతిభావంతులలో రాంజీ డాట్ ఒకరు. విజువల్ ఎఫెక్ట్స్‌ను కేవలం సాంకేతిక అవసరంగానే కాకుండా, కథను మరింత ప్రభావవంతంగా చెప్పే సాధనంగా మలుస్తూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అత్యాధునిక టెక్నాలజీపై పట్టు, సృజనాత్మక ఆలోచన, కథపై అవగాహన?ఈ మూడు అంశాల సమన్వయమే రాంజీ డాట్ పనితీరుకు ప్రధాన బలం. అందుకే ఆయన రూపొందించే ప్రతి విజువల్ ప్రేక్షకుడిని కథలో మరింతగా లీనమయ్యేలా చేస్తుంది.

# శ్రద్ధ 'ఈఠ'కు ఊరట.. మద్దతుగా నిలిచిన ఫ్యామిలీ.. !




శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో, లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం లో రాబోతున్న చిత్రం 'ఈఠ'. మరాఠీ 'లవాణి' కళాకారిణి 'విఠాబాయి నారాయణ్ గావ్‌కర్' జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ బయోపిక్ నుంచి జూన్ 23న టీజర్ విడుదలై వివాదంలో చిక్కుకుంది. 'ఈఠ' టైటిల్ పేరుపై రాజకీయపార్టీ ఎన్‌సీపీ, విఠాబాయి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ..  విఠాబాయి మహారాష్ట్రకు చెందిన గొప్ప జానపద కళాకారిణి. ఆమె జీవితం ఆధారంగా వస్తోన్న ఈ సినిమాకు ఆమె పేరే ఉండాలి అని సూచించారు. అయితే తాజాగా శ్రద్ధాకపూర్ నటిస్తున్న 'ఈఠ'కు ప్రముఖ లావణి కళాకారిణి విఠాబాయి నారాయణ్ గావ్‌కర్ కుమార్తె మంగళా బన్సోడే కరవడికర్ మద్దతు తెలిపారు. ''ఈఠ' టైటిల్ విషయంలో మా కుటుంబానికి ఎలాంటి అభ్యంతరం లేదు. ఈ టైటిల్ చాలా సముచితమైనది, ఎందుకంటే మా అమ్మ ప్రదర్శనలు ఇచ్చిన గ్రామాల్లోని ప్రజలు ఆమెను తరచుగా 'ఈఠ' అని పిలిచేవారు' అని తెలపగా.. మొత్తానికి ఈ సినిమాకు ఊరట కలిగినట్లు అయింది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com